RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 17 ISSUE NO : 17 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం, జూలై, 4, 2025 Friday, July ,4, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## బంగారం కొనేవాళ్లలో తొలి స్థానం

# తెలుగు మహిళలదే

## విదేశీయులకు ట్రంప్ మరో బిగ్ షాక్

వాషింగ్టన్: విదేశీయులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షాకిచ్చారు. విద్యార్థులు,విజిటర్ల వీసాలపై నిర్దిష్ట సమయాన్ని విధించనున్నారు. ఆ గడువు పూర్తయిన విద్యార్థులు, విజిటర్లు వారి వీసాల్ని రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. రెన్యువల్ కాకపోతే దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్ విధానంపై ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో అమెరికాలో విదేశీయులపై ఆంక్షల కత్తి వేలాడుతున్నట్లైందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో అక్రమ వలస దారులు అరికట్టేలా అమెరికా డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. విదేశీ విద్యార్థులు, టూరిస్టులు దేశంలో ఉండే సమయాన్ని నిర్దేశించనుంది. ఆ సమయం గడువు దాటిన తర్వాత దేశంలో ఉంటే వా రిపై కఠిన చర్యలు తీసుకునేలా కొత్త వీ సా ప్రతిపాదనలు తెచ్చింది.ఇప్పటి వరకు ఉన్న డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్ విధానాన్ని రద్దు చేసి, ప్రతి వీసాకు నిర్దిష్ట గడువు విధించాలని ట్రంప్ సర్కారు భావిస్తోంది.



## హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దుతాం

## మలబార్ జేమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్ ప్రారంభోత్సవంలో సీయం రేవంత్

**హైదరాబాద్, జులై 03,తెలంగాణ దిశ:** హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మహేశ్వరంలో మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరంలో మలబార్ తయారీ యూనిట్ ఏర్పాట్టుయడం సంతోషంగా ఉందన్నారు.డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ ట్కజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించబోతున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామన్నారు. మహేశ్వరంలో ఫోర్త్ సిటీ భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించబోతున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వాలు మారినా మన పారిశ్రామిక పాలసీలు మార్చలేదని గుర్తు చేశారు. పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెళుతున్నామని వివరించారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాదు.. వారికి లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి యూనిట్ ఏర్పాటు చేసిన మలబార్ గ్రూప్‌నకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే గురువారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోదిగిన ఆయనకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని తాజ్ కృష్ణ హోటల్‌కు ఖర్గే రుకున్నారు.అయితే మంత్రి పదవి ఆశించి భంగపడ్డ పలువురు ఎమ్మెల్యేలతోఖర్గే భేటీకానున్నారు. అందు కోసం వారికి ఖర్గే అపాయింట్‌మెంట్ ఇచ్చారు. కా గా,ఆది శ్రీనివాస్, బాలు నాయక్‌మల్‌రెడ్డి రంగా రెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, సుదర్శన్ రెడ్డి, తదితరులు ఇప్పటికే తాజ్ కృష్ణా హోటల్‌కు చేరుకున్నారు. అ లాగే తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య సైతం ఖార్గేతో భేటీ కానున్నారు.



## తెలంగాణ నీటి వాటాను ఏపీకి దారాదత్తం చేశారు..

## కేసీఆర్, హరీష్‌లపై మహేష్ గౌడ్ ఫైర్

**హైదరాబాద్,జులై,03,తెలంగాణ దిశ:** మాజీ మంత్రి హరీష్‌రావుకి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణకు నీటి వాటాను కాలరాసిందే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు అని మండిపడ్డారు. కేసీఆర్ తెలంగాణ నీటి వాటాను ఏపీకి దారాదత్తం చేశారని ధ్వజమెత్తారు. ఒక్క నీటి బొట్టు కూడా వదలబోమని సీఎం రేవంత్‌రెడ్డి అనుకున్నా రని.. కాబట్టే బనకచర్ల పనులు ఆగిపోయాయని చెప్పుకొచ్చారు.గురువారం గాంధీభవన్‌లో మహేష్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు.

## వరంగల్ రాజకీయంలో..

# కొత్త ట్విస్ట్..!

## మీనాక్షితో కొండా దంపతుల ప్రత్యేక భేటీ



**హైదరాబాద్,జులై,03,తెలంగాణ దిశ:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రికొండా సురేఖ, మురళి ఎపిసోడ్‌లో ట్విస్ట్‌ల మీదట్విస్ట్‌లు చోటుచేసుకుంటున్నాయి.తాజాగా హైదరాబాద్ లోనిఎమ్మెల్యే క్వార్టర్స్‌లోకాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌తోకొండా దంపతులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ.. ఇంచార్జి మీనాక్షికి 16 పేజీల నివేదికను అందజేశారు. ఈనివేదికలో వరంగల్ జిల్లాలోగ్రూప్ రాజకీయాలగురించి వివరించినట్టు సమాచారం.ఈ క్రమంలో తమపై వచ్చినఆరోపణలపై కొండాదంపతులు ఇద్దరు సమాధానం?చెప్పారు. ఇంచార్జీకి రిపోర్ట్ ఇచ్చినట్టు తెలిపారు. నిజాలు తెలుసుకున్న తర్వాత ఎవరిది తప్పుంటే వాళ్ళపైచర్యలు తీసుకోమని కోరారు. రాజీనా మా చేసిన తర్వాతే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చా మని వారిద్దరూ నివేదికలో క్లారిటీ ఇచ్చారు. నాయిని రాజేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మీనాక్షి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పుకొచ్చారు.

## భాగస్వామ్యమే కాదు..


# సహ ప్రయాణం

## ఘనాలో ప్రధాని మోదీ



**అక్రా,జులై,03:** ఘనా అభివృద్ధి ప్రయాణంలో భారత్ కేవలం భాగస్వామి మాత్రమే కాదని, సహ ప్రయాణం సాగిస్తున్నదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రధాని తన ఐదు రోజుల పర్యటనలో భాగంగా పశ్చిమ ఆఫ్రికాలోని ఘనాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఘనాలో ప్రధాని మోదీకి ఆ దేశ ప్రతినిధుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఆ తరువాత ఆయన ఘనా అధ్యక్షుడు జాన్ డ్రామానీ మహామాతో పలు భాగస్వామ్య అంశా లపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాను ఉద్దేశించి ప్రకటన చేశారు. రాబోయే ఐదు సంవత్సరాలలో ఇరు దేశాలు ద్విమార్గ వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని, భారత్.. ఘనాకు కేవలం భాగస్వామి మాత్రమేకాదని, ఘనాఅభివృద్ధి ప్రయాణంలోసహ ప్రయాణం చేస్తున్నదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత కంపెనీలు ఘనాలో దాదాపు 900 ప్రాజెక్టులలో రెండు బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టాయన్నా రు. రాబోయే ఐదేళ్లలో పరస్పర వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఫిన్‌టెక్ రంగంలో, భారతదేశం ఘనాతో యూపీఐ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉందని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువని.. ఇరు దేశాలు స్పష్టం చేశాయని, ఆ ముప్పును ఎదుర్కోవడంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు ప్రధాని తెలిపారు. రక్షణ, భద్రతా రంగంలో తాము సంఘీభావర్వారా భద్రత అనే సూత్రంతో ముందుకు సాగుతామన్నారు.

## ర్యాష్ డ్రైవింగ్ చేసి చనిపోతే.. ఇన్సూరెన్స్ వర్తించదు: సుప్రీం



**న్యూఢిల్లీ,జులై,03:** అతివేగంగా లేక నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ప్రాణాలు కోల్పోతే, ఆ బాధిత కుటుంబాలకు ఇన్సూరెన్స్ వర్తించదు అని సుప్రీంకోర్టు తెలిపింది. ఇన్సూరెన్స్ కంపెనీలు ఆ ఫ్యామిలీకి నష్టపరిహారాన్ని ఇవ్వలేవని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పీఎస్ నరసింహా,ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఓ కేసులో ఈ తీర్పును వెలువరించింది. కారు ప్రమాదంలో మరణించిన తన భర్తకు నష్టపరిహారంగా 80 లక్షలు ఇవ్వాలని భార్య పెట్టుకున్న దరఖాస్తును సుప్రీం విచారించింది. అయితే కారును అతి వేగంగా డ్రైవ్ చేస్తూ అతను యాక్సిడెంట్‌కు గురై చనిపోయాడు. 2024, నవంబర్ 23వ తేదీన ఇదే కేసులో కర్నాటక హైకోర్టు తీర్పును ఇచ్చింది. భార్య, కుమారుడు, బాధితుడు పేరెంట్స్ పెట్టుకున్న నష్టపరిహార అభ్యర్థనను కోర్టు కొట్టిపారేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోలమేని, అం దుకే స్పెషల్ లీవ్ పిటీషన్‌ను డిస్మస్ చేస్తున్నామని సుప్రీం బెంచ్ తెలిపింది. 2014, జూన్ 18వ తేదీన బాధిత వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. మల్లసంద్ర బాధిత వ్యక్తి ఎన్ఎస్ రవిశ కారు ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో కారులో అతని తండ్రి, సోదరుడు, పిల్లలు ఉన్నారు.

## ఆసరా పెన్షన్ల పెంపు కోసం మహాగర్జన : మందకృష్ణ



**హైదరాబాద్,జులై,03,తెలంగాణ దిశ:** వికలాంగులుఆసరా పెన్షన్ దారుల కోసం ప్రభు త్వం హామీ ఇచ్చిన పెన్షన్ పెంపును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ,వచ్చే ఆగస్టు 13న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో "మహాగర్జన" పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ వెల్లడించారు.బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లు పెంచాల్సిందే. లక్షల మంది ఆసరా, వికలాంగుల పెన్షనుదారులను సమీకరిస్తాం. మహాగర్జనతో హైదరాబాద్ రహదారులను దిగ్బంధిస్తాం. ఆగస్టు15 నుంచి 20 మధ్యలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. అందులోపే వికలాం గులకు రిజర్వేషన్లు క ల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం," అన్నారు.మంద కృష్ణ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. "ఇంకా మొండితనం కొనాగితే, ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం" అని పేర్కొన్నారు. మహాగర్జన ద్వారా తమ ఆవేదన ను రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంగా తెలియజేస్తామని, తమ హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## ఇండియా కూటమి లోక్‌సభకే పరిమితం: కేజ్రీవాల్



**న్యూఢిల్లీ,జులై,03::** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఒంటరిగా బరిలోకి దిగుతుందని ఆ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. కాంగ్రెస్, ఇండియా కూటమిలోని మిత్ర పక్షాలతో ఎటువంటి పొత్తూ ఉండబోదని స్పష్టం చేశారు. గుజరాత్ పర్యటనలో ఉన్న ఆయన గురువారం అహ్మదాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఇండియా కూటమి కేవలం లోక్ సభ ఎన్నికల కోసం మాత్రమేనని తెలిపారు. ప్రస్తుత జరగబోయే బిహార్‌ఎన్నికల్లోఒంటరిగా పోటీ చే స్తామన్నారు. గుజరాత్‌లోని విసావదర్ ఉప ఎన్నికలో ఆప్,కాంగ్రెస్ విడివిడిగా పోటీ చేశాయని, పొత్తు ఉంటే ఇలా ఎందుకు చేస్తామని ప్రశ్నించారు.ఆ బైపోల్‌లో కాంగ్రెస్ కంటే మూడు రెట్లు ఎక్కువ ఓట్లతో గెలిచామని గుర్తు చేశారు.

## ఫ్యూయల్ బ్యాన్‌పై ఢిల్లీ సర్కార్ యూటర్న్

**న్యూఢిల్లీ,జులై,03:** జీవితకాలం ముగిసిన వాహనాలకు ఆయిల్ పంపుల వద్ద ఇంధనాన్ని నిషేధిస్తూ ఢీల్లీ ప్రభుత్వం ఇటీవలే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయం జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. అయితే, ఈ నిర్ణయంపై ఢిల్లీ ప్రభుత్వం అనూహ్యంగా యూటర్న్ తీసుకుంది. ఇంధనం బ్యాన్ నిర్ణయంపై వెనక్కి తగ్గింది. ఢిల్లీలో ఇంధనం బ్యాన్ సాధ్యం కావడం లేదని తెలిపింది. వాహన వయసు ప్రకారం స్క్రాప్ చేయలేమని పేర్కొంది. కాలుష్య కారక వాహనాలను మాత్రం సీజ్ చేయనున్నట్లు వెల్లడించింది. వాహన కాలుష్యాన్ని తగ్గించ డంలో భాగంగా 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిపడాన్ని అనుమతించేది లేదని ఢిల్లీ ప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే.



## 'స్వర్ణాంధ్ర విజన్-2047' డాక్యుమెంట్

# అరచేతిలో వైకుంఠమా?




**అమరావతి,తెలంగాణ దిశ:** గత వారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం ఆవిష్కరించిన 'స్వర్ణాంధ్ర విజన్-2047' డాక్యుమెంట్ .. నియో లిబరల్ విధానాలు మరింత త్వరితగతి అమలుకు రోడ్ మ్యాప్. అడ్డూ అదుపు లేని కార్పోరేట్ దోపిడీకి రెడ్ కార్పెట్. వికసిత భారత్ నిర్మాణం కోసం కేంద్రంలో నరేంద్ర మోడీ తీసుకొచ్చిన 'విజన్-2047'లో భాగంగా రాష్ట్రంలో నూ తీసుకొచ్చామని చంద్రబాబు, కూటమి నేతలు ప్రకటించారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రతిపాదించిన విజన్‌లో అణువణువూ మతతత్వ-కార్పొరేట్ విధానాల కలబోత కాగా.. అందులో భాగమే తమ 'కల' అంటున్నారు చంద్రబాబు. ప్రజలందరికీ సంపద, ఆరోగ్యం, సంతోషం అందించడమే లక్ష్యమని చెబుతున్నారు. పేదరికం లేని సమాజం, ఉపాధి- ఉద్యోగ కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, ఇత్యాది పది సూత్రాలు తమ విజన్‌కు ప్రాతిపదికగా పేర్కొన్నారు. 2047 నాటికి అందరికీ అక్షరాస్యత, 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 42 వేల డాలర్ల తలసరి ఆదాయం, 60 శాతానికి పట్టణ జనాభా, రెండు శాతానికి నిరుద్యోగిత రేటు తగ్గింపు, 85 సంవత్సరాల సగటు ఆయు ప్రమాణం, 450 బిలియన్ డాలర్ల ఎగుమతులు లక్ష్యాలుగా ప్రకటించారు. ఈ 'కలలు' ఆకర్షణీయంగానే కనిపిస్తున్నప్పటికీ వాటి సాధనకు ఎంచుకున్న విధానాలే సదరు కలలను కల్లలు చేస్తాయి.రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పి-4 విధానాన్ని తారకమంత్రంగా జపిస్తోంది. ఇప్పటి వరకు మూడు 'పి' లు? పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) వాడుకలో ఉంది. కొత్తగా పీపుల్, పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపిపి)? నాలుగు 'పి' ల ఫార్ములా తెర మీదికి తెచ్చారు. అందులో భాగంగానే విజన్ డాక్యుమెంట్ విడుదల వేదికపై నుంచి ఎక్కడ పరిశ్రమ వస్తే అక్కడి రైతులు భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చిన ట్లున్నారు. దానర్థం కార్పొరేట్లు పరిశ్రమలు, ప్రాజెక్టులు పెడతారు. అందుకు కావాల్సిన భూములను రైతులు త్యజించాలన్నమాట. రైతుల భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కుట్ర పి-4 సిద్ధాంతం వెనుక దాగుంది. ఇప్పటికే మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోనిటైజేషన్ పైప్‌లైన్ అంది. అడవులను, నదులను, సముద్రాలను, చివరికి జాతీయ రహదారుల, రైల్వే ట్రాక్‌ల వెంబడి భూములను సైతం కార్పొరేట్లకు అప్పగిస్తోంది. చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ అందుకు భిన్నమైంది కాదు. ఆర్థిక హబ్‌లు, హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్, రెండు మెగా పోర్టులు, రీసైక్లింగ్ క్లస్టర్, నౌకా నిర్మాణం, టూరిజం ప్రాజెక్టులు, ఎ.ఐ, డ్రోన్లు.. ఇవన్నీ ప్రైవేట్ కార్పొరేట్ల ప్రాపకం కోసమే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాస్తా స్పీడ్ ఆఫ్ బిజినెస్‌గా మారిందీ అందుకే. ఇప్పటికే జగన్ ప్రభుత్వం రాష్టాన్ని అదానీ ప్రదేశ్‌గా మార్చింది. పోర్టులు, విద్యుత్, సకలం అదానీకి సమర్పించారు. జగన్ ప్రభుత్వం రాష్టాన్ని విధ్వంసం చేసిందన్న కూటమి తాను కూడా అదే బాటలో పయనిస్తోందనడానికి సెకితో సౌర విద్యుత్ ఒప్పందం కొనసాగింపు మంచి ఉదాహరణ.

# ప్రపంచంలో మొదటి ఫెర్టిలో శిశువు జననం



**లిమా,:** 'ఫెర్టిలో' అనే సరికొత్త సంతానోత్పత్తి విధానంతో ప్రపంచంలోనే మొదటిసారి ఓ శిశువు జన్మించింది. ఫెర్టిలో పద్ధతి ద్వారా గర్భందాల్చిన ఓ మహిళ.. పెరూ దేశ రాజధాని లిమాలోని సాంటా ఇసాబెల్ క్లినిక్‌లో బిడ్డకు జన్మనిచ్చింది.

తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు ప్రకటించారు. అమెరికాలోని గేమ్టో అనే సంస్థ ఈ కొత్త సంతానోత్పత్తి విధానాన్ని అభివృద్ధి చేసింది. ప్రస్తుతం సంతానలేమి సమస్యతో బాధపడుతున్న

### ఐవీఎఫ్‌కు ప్రత్యామ్నాయ విధానం

దంపతులు ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) ద్వారా పిల్లలకు జన్మనిస్తున్నారు. అయితే, ఈ ప్రక్రియ సుదీర్ఘమైనది, ఖరీదైనది కావడం, కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉండటం వంటి సవాళ్లు ఉన్నాయి. దీనికి ప్రత్యామ్నా యంగా గేమ్టో సంస్థ ఫెర్టిలో అనే విధానాన్ని అభివృద్ధి చేసింది. ఐవీఎఫ్ విధానంలో అండాలు పరిపక్వం చెందేలా ప్రేరేపించడానికి దాదాపు 90 హార్మోన్ ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో ఈ విధానం ఖరీదైనదిగా మారింది.

ఈ ఫెర్టిలో విధానంలో మహిళ నుంచి అండాన్ని సేకరించి ల్యాబ్‌లో పరిపక్వం చెందేలా చేస్తారు. ఇందుకు ఇండ్యూస్డ్ ప్లూరిపోటెంట్ స్టెమ్ సెల్స్(ఐపీఎస్‌సీ) నుంచి సేకరించే ఓవరియన్ సపోర్ట్ సెల్స్(ఓఎస్‌సీ)ను వినియోగిస్తారు. దీంతో హార్మోన్ ఇంజెక్షన్ల అవసరం గణనీయంగా తగ్గడంతో పాటు మొత్తం ప్రక్రియ వేగవంతం అవుతుందని, సైడ్ ఎఫెక్ట్స్ తగ్గుతాయని గేమ్టో సంస్థ చెప్తున్నది. అండం పరిపక్వం చెందిన తర్వాత చేసే మిగతా ప్రక్రియ మొత్తం ఐవీఎఫ్‌లానే ఉంటుంది.

# పార్టీకి తలనొప్పిగా మారిన కొలికపూడి?



**విజయవాడ,తెలంగాణ దిశ:** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి తలనొప్పిగా తయారైన ఎమ్మెల్యేల్లో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఒకరు. పార్టీ నేతలతో వివాదాలు, కర్ర పెత్తనం, దూషణలతో తీరు మార్చుకోమని పార్టీ పెద్దలు పదేపదే చెబుతున్నా ఆయనలో మాత్రం మార్పు రావడం లేదు.ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మంగళవారం బెల్ట్‌షాపులపై దాడుల పేరుతో చేసిన హడావుడితో టీడీపీ ఇరకాటం లో పడింది. రాష్ట్రంలో ఎక్కడా బెల్ట్‌షాపులే లేవని ఓ పక్కన ఎక్సైజ్ మంత్రి మొదలుకుని ముఖ్యమంత్రి వరకు గొప్పలు చెబుతుంటే అధికార పార్టీ ఎమ్మెల్యే రోడ్లపై పరుగులు తీస్తూ బెల్టు దుకాణాల్లో తనిఖీలు చేస్తూ, అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకోవడం కలకలం రేపింది. ఎమ్మెల్యే ఇలా ఎందుకు చేశారనే దానిపై రకరకాల వాదనలు ఉన్నా టీడీపీ నేతలు మాత్రం ఎమ్మెల్యే తీరును తప్పు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే కొలికపూడి కంట్ర వర్సీకి కేరాఫ్ అడ్రస్ అయ్యారు.అధ్యాపక వృత్తి నుంచి అమరావతి ఉద్యమంలోకి అడుగుపెట్టిన కొలికపూడి శ్రీనివాసరావును ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రిజర్వుడు నియోజక వర్గం నుంచి పోటీ చేసే అవకాశం లభించింది. కూటమి ప్రభంజనంలో సునాయసంగానే గెలిచారు. గెలిచిన తర్వాత ఎమ్మెల్యే తీరులో ఒక్కసారిగా మార్పు వచ్చింది. నియోజక వర్గం మొత్తం తన చెప్పు చేతల్లో ఉండాలనే ధోరణిలో ఉండటంతో స్థానికంగా విభేదాలు మొదలయ్యాయి. దీనికి తోడు స్థానికంగా ఉండే కుల, వర్గ రాజకీయాలు కూడా ఎమ్మెల్యేకు మింగుడు పడలేదు. తిరువూరులో ఉండే కుల ఆధిపత్య ధోరణులు కూడా ఎమ్మెల్యే వైఖరికి కారణమనే ప్రచారం కూడా ఉంది.ఎమ్మెల్యేగా ఎన్నికైన నెలరోజుల్లోనే.. ఈ ఏడాది జూలైలో ఎ.కొండూరు మండలం కంభంపాడులో వైసీపీ నాయ కుడు పంచాయతీ స్థలం ఆక్రమించి, భవనం నిర్మిస్తు న్నాడని ఆరోపిస్తూ ఆ భవనం వద్దకు వెళ్లి జేసీబీతో దానిని పడగొట్టాల్సిందేనని ఆందోళనకు దిగారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటా మని అధికారులు చెప్పినా వినకుండా అక్కడే బైఠాయించారు. ఈ ఘటన సంచలనం కావడంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉండవల్లి పిలిపించుకుని మందలించారు.ఆ తర్వాత పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారనే నెపంతో టీడీపీ ప్రజాప్రతినిధిని అందరి ముందు బట్టలిప్పి కొడతానంటూ బెదిరించడంతో అతని భార్య ఆత్మహత్యా యత్నం చేసింది. దీంతో అతని వర్గం నాయకులు విజయవాడలో ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగడం కలకలం రేపింది. తిరువూరులో మట్టి తరలింపుపై మీడియాలో వార్తలు రావడంతో వారిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఎమ్మెల్యేపై స్థానిక నాయకులు టీడీపీ పెద్దలకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికార పార్టీ ఎమ్మెల్యే ఉండగానే నియోజక వర్గానికి మరో ఇన్‌ఛార్జిని నియమించారు. పార్టీలో ఇతర నేతలు జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో తీరు మార్చుకుంటానని బహిరంగంగా ప్రకటించారు మళ్లీ కొలికపూడి చెలరేగిపోయారు. వీధుల్లో పరుగులు తీస్తూ మద్యం దుకాణాల వద్ద హంగామా చేశారు. ఉదయాన్నే మద్యం షాపులకు వెళ్లి బెల్టు షాపులు నిర్వహిస్తున్నారంటూ షాపులకు తాళాలు వేయిం చారు. షాపు తాళాలు తీస్తే ఊరుకోనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరువూరు పట్టణంలో ఉన్న షాపుల్ని పట్టణ శివార్లలో పెట్టుకోవాలని, బెల్టుషాపుల్ని తొలగించకపోతే తానే తొలగిస్తానంటూ మండిపడ్డారు. తిరువూరు నియోజక వర్గంలో ఉన్న 16 మద్యం షాపుల్లో తిరువూరు పట్టణంలో 4, రూరల్‌లో 2, గంపలగూడెంలో 4, ఎ. కొండూరులో 2, విన్ననపేటలో 4 షాపులు ఉన్నాయి. మద్యం వ్యాపారంపై ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం దుకాణాలు మూయించడంపై నిర్వాహకులు బిత్తరపోతున్నారు. ఎమ్మెల్యే వేధింపులపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని యోచిస్తున్నారు. మరోవైపు టీడీపీ అధిష్టానం కూడా ఎమ్మెల్యే వ్యవహార శైలిపై విచారణ జరుపుతోంది.

# సిరిసిల్లలో 'పోలీసు అక్క'

**కరీంనగర్,తెలంగాణ దిశ:**సిరిసిల్ల జిల్లా పోలీసులు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బాలికలు, మహిళల భద్రత కోసం 'పోలీస్ అక్క' వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా "పోలీస్ అక్క" పేరుతో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ కానిస్టేబుల్‌ను ఎంపిక చేశారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటించారు.వినూత్న కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహిళల రక్షణ కోసం 'పోలీసు అక్క' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. షీ టీమ్ కు అదనంగా ప్రతి పోలీస్ స్టేషన్ కు "పోలీస్ అక్క" పేరుతో మహిళ కానిస్టేబుల్ ఎంపిక చేశారు. వారు పోక్సో యాక్ట్,గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్, మహిళ చట్టాలపై అవగాహన కల్పించనున్నారు.సిరిసిల్లలో షీ టీమ్ ఆధ్వర్యంలో ఏర్పటు చేసిన "పోలీస్ అక్కా" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. జిల్లాలో మహిళా రక్షణకు ప్రథమ బాధ్యతగా తీసుకుంటూ మహిళ రక్షణయే దెయ్యంగా షీ టీమ్ ఆధ్వర్యంలో విన్నూత కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే "పోలీస్ అక్క" పేరుతో జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ కానిస్టేబుల్ ఎంపిక చేయడం జరిగిందన్నారు. పోలీస్ అక్కగా ఎంపిక కాబడిన వారు షీ టీమ్ కి సహాయకంగా ఉంటారని ఎస్పీ పేర్కొన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలను సందర్శిస్తూ విద్యార్థులకు పోక్సో యాక్ట్, సెక్సువల్ హారస్మెంట్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు వారు సంప్రదించే విధంగా షీ టీమ్, డయల్ 100, పోలీస్ అక్క నంబర్లు ఆయా పాఠశాలల్లో, కళాశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థిని విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఎస్పీ మహాజన్ సూచించారు. సోషల్ మీడియాలో వేదికగా విద్యార్థినుల పట్ల వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే నిర్భయంగా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

ఆటకట్టిస్తున్న షీ టీమ్?: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏర్పాటు చేసిన షీ టీమ్ సత్ఫలితాలు ఇస్తుందని ఎస్పీ తెలిపారు. విద్యార్థుల మహిళల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ ఈ సంవత్సరం 52 మంది ఆకతాయిలను రెండ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం మహిళలను, విద్యార్థులను వేధిస్తున్న వారిపై 60 పెట్టి కేసులు, 44 ఈఎఫ్ఐ లు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. పిఎస్‌ల వారిగా పోలీస్ అక్కలు...: సిరిసిల్ల టౌన్ - సరస్వతీ, తంగలపల్లి - సుజాత, ముస్తాబాద - మంజుల, ఎల్లతకుంట -ప్రవళిక, ఎల్లారెడ్డిపేట - రోజా, గంభీరరావుపేట. శిరీష, వీరన్నపల్లి- స్వప్న., వేములవాడ టౌన్ - లత, వేములవాడ రూరల్ - రేణుకా, బోయినపల్లి. పినాకల్ యాదవ్, చందోర్తి - శ్రీవెన్నెల, కోనారావుపేట- సంధ్య, రుద్రాంగి. -జి అమల.

# నల్గొండ వర్శిటీలో గొడ్డు కారంతో లంచ్?

### విద్యార్థినుల ఆందోళనలతో మార్పు...

**నల్గొండ,తెలంగాణ దిశ:**పిల్లల చదవుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. విద్యా హక్కు చట్టం ప్రకారం.. అందరూ చదువుకోవాలన్న ఉద్దేశంతో నిర్బంధ విద్య అమలు చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం,కళాశాల విద్యార్థులకు కూడా కొన్ని రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నాయి. ఇకపేదలు కూడాఉన్నతచదవులు చదువోకోవాలని ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తున్నాయి. ఇక యూనివర్సిటీల్లో చదువుకునే పిల్లలకే కేంద్రం యూసీసీ ద్వారా నిధులు అందిస్తోంది. భోజనంతోపాటు, చదువులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ వాటాగా సదుపాయాలు కల్పిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో తెలంగాణలోని ఓ యూనివర్సిటీలో విద్యార్థులను ఖైదీలకన్నా అధ్వానంగా చూస్తున్నారు. గొడ్డుకారంతో భోజనం పెడుతున్నారు. విద్యార్థులు ఈ దృశ్యాలను ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.నల్గొండలోని మహాత్మాగాంధీ యూనిర్సిటీ యాజమాన్యం విద్యార్థులను ఖైదీల్లా చూస్తోంది. హాస్టళ్లలో ఉండే ఆడ పిల్లలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం గొడ్డుకారంతో పెడుతున్నారు.

ఈ విషయాన్ని విద్యార్థులు పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. అయినా యాజమాన్యం స్పందిచండం లేదు. ఖైదీలకు కూడా ఇలా గొడ్డుకారంతో భోజనం పెట్టరని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కారంతో భోజనం చేయలేక పస్తులు ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణవేణి హాస్టల్‌లోని విద్యార్థినులు భోజనం నిర్వాహకులతో గొడవకు దిగారు.రోజూ కారంతో టిఫిన్, భోజనం పెట్టడంపై యాజమాన్యం స్పందించకపోవడంతో విద్యార్థినులు నిర్వాహకులను నిలదీశారు. ఇలాంటి అన్నం ఎలా తినాలని ప్రశ్నించారు. మీ పిల్లలకు ఇలాగే పెడతారా అని నిలదీశారు. ప్రభుత్వాలు తమ కోసం కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నా తమకు ఎందుకు ఇలాంటి భోజనం పెడుతున్నారని ప్రశ్నించారు.

# సినిమా-రాజకీయం.. ఏం జరుగుతోంది?

ప్రజలు సినిమాని విపరీతంగా ప్రేమిస్తారు. హీరోలను ఆరాధిస్తారు. ఒకప్పుడు దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమకు మద్రాస్ కేంద్రంగా ఉండేది. కేవలం సినీ తారలను చూసేందుకే తెలుగు టూరిస్టులు మద్రాసు వెళ్లేవారు. ఎన్‌టి రామారావు, నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్ బాబు వంటి అగ్రనటులు ..వాణిశ్రీ, జయసుధ, జయప్రద,శ్రీదేవి, అంతకు ముందు తరంలో సావిత్రి, జమున, క్రుష్ణ కుమారి వంటి తారలను చూడకుండా వచ్చేవారు కాదు. ప్రతి రోజు ఉదయం నిర్ణీత సమయంలో తారలు తమ బాల్కనీ నుండి అభిమానులకు దర్శనం ఇస్తుండేవారు. కాసేపు వారితో ముచ్చటించేవారు. మొదటి నుంచీ సినీ ప్రేక్షకులకు నటీనటుల పట్ల ఆరాధ్య భావన ఉంది. అభిమాన సంఘాల హడావుడి సంగతి సరేసరి. అయితే అప్పట్లో నిర్మాత దర్శకులు సామాజిక స్పృహ, సామాజి బాధ్యతతో సమకాలీన అంశాలు ఇతివృత్తంగా సినిమాలు తీసేవారు. అలాగు ఇంటిల్లిపాది చూడదగిన కుటుంబ కథా చిత్రాలు, కామెడీ మూవీస్ ఎక్కువగా వచ్చేవి. హీరోలు కూడా అలాంటి కథలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. అయితే ఇప్పుడు అది లోపించింది. నటులుగా తమకు సమాజంపై బాధ్యతఉంటుందని భావించే సినీతరం తగ్గిపోయింది. తప్పు పనులు చేయకూడదు, చేస్తే వాటి ప్రభావం తమ వ్యక్తిత్వంపై, సినీప్రస్థానంపై పడుతుందనే ఆలోచన, భయం ఇప్పటి సినిమావాళ్లలో తక్కువగా ఉంది.సినిమాల్లో వ్యాపారధోరణి పెరిగి ప్రేక్షకులు, అభిమానులను సినిమా విజయానికి, రాబడికి వాడుకోవటం జరుగుతోంది. నేటి సినిమావాళ్లు ప్రజలకు ఇచ్చేదేమీ లేకున్నా, జనం సొమ్ముతో బ్జడెట్‌ను ఎలా రాబట్టుకోవాలో అనే ఆలోచనే వారికి ప్రధానమైంది. ఇలా క్రమంగా పాత విలువలకు దూరమవుతూ సినీజీవులు రకరకా ల సమస్యలను సృష్టిస్తున్న ఉదంతాలు ఈ మధ్య వరుస కడుతున్నా యి. తెలంగాణలో ప్రభుత్వం మారిన తర్వాత ఉత్పన్నమైన కొన్ని సంఘటనలు రాజకీయ దుమారాన్నికూడా రేపాయి. సాధారణంగా రాజకీయ పార్టీలు సినిమావాళ్లతో మంచి సంబంధాలనే నెరుపు తుంటాయి. ఎన్నికల ప్రచారానికి వాడుకోవచ్చని మర్యాద ఇస్తుంటా రు. అయితే ఈ మధ్య లోబ్జడెట్ సినిమాలు పెరిగి పెద్దనటుల సినిమాలు తగ్గిపోతున్నాయి. పాన్ ఇండియా సినిమాలపై పెట్టిన డబ్బు కోసం యువతను ఆకర్షించే పనిలోపడి పరిశ్రమ కుటుంబ ప్రేక్షకులకు దూరమవుతోంది. దీనివల్ల సినిమావాళ్లపై రాజకీయ పార్టీలకు గురి కూడా తగ్గిపోతోంది. వారిని ప్రత్యేకంగా చూడాలనే అవసరం కూడా ఇప్పుడు కానరావడం లేదు. దీనికి కారణం సినిమావాళ్ల తీరే ప్రధానమని చెప్పవచ్చు. తమ హీరోలను ఏమైనా అంటే ఊరుకొనేది లేదు అనే వీరాభిమాన ప్రేక్షకులు కూడా కరువవు తున్నారు. ఈ మధ్య హీరో నాగార్జున ఫంక్షన్ హాల్‌ను హైడ్రా యంత్రాలు నిట్టనిలువునా కూల్చేసినా అడిగేనాథుడే లేకుండాపో యాడు. తప్పు ఆయనదా కాదా అనే విషయం పక్కనపెడితే ప్రముఖ హీరోగా పేరు, గుర్తింపు ఉన్నా ఆయన్ని తాకడానికి ప్రభుత్వం వెనుకాడలేదు. పైగా హైదరాబాద్ చెరువుల పరిరక్షణకు బయలుదే రిన ఆ ప్రభుత్వ సంస్థ ఏకంగా నాగార్జున షెడ్ల నేలమట్టంతోనే తన పనికి శ్రీకారం చుట్టింది. చెరువు ఒడ్డుపై 2010లో నిర్మించిన ఈ కట్టడం కోర్టు స్టేపై కొనసాగి 14 ఏళ్ల తర్వాత ఆగస్టు 24 న కూల్చివేతకు గురైంది. ఈ చర్యతో సినిమావాళ్లంటే గొప్పేమీ కాదని ప్రభుత్వం చేతల ద్వారా రుజువు చేసింది. మామూలు మనుషులకు, సినిమావాళ్లకు తేడా ఏమి లేదని మొత్తం సినీ పరిశ్రమకే రేవంత్ సర్కారు షాకిచ్చింది. దెబ్బ మీద దెబ్బగా నాగార్జున కుటుంబాన్ని మంత్రి కొండా సురేఖ వార్తల్లోకి లాగారు. నాగార్జున కొడుకు విడాకుల విషయంలో కెటిఆర్ ప్రమేయం ఉందంటూ ఆవిడ సినీరంగానికి, రాజకీయాలకు కొత్త ముడివేశారు.సినీ పరిశ్రమ యావత్తు మంత్రి మాటల పట్ల మూకుమ్మడిగా తీవ్ర అభ్యంతరం తెలపగా చిన్న మాటతో ఆమె కథ ముగించారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగిందని కెటిఆర్ కోర్టుకు వెళ్లారు. కానీ నాగార్జున పరివారం మాత్రం ఇది ఇంతటితో ఆగితే చాలనుకున్నారు. ప్రభుత్వంలో ఉన్న ఒక మహిళా మంత్రితో యుద్దానికి దిగితే మరింత చిక్కుల పాలవడమే అని వారు అనుకున్నారేమో. ఇలా ఘనమైన అక్కినేని వారసత్వం తల దించుకోక తప్పలేదు. నటుడు మోహన్ బాబు ఇటీవల ఒక టివి ఛానల్ రిపోర్టర్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే కదా. 2007లో ఆయనకు పద్మశ్రీ అవార్డు వచ్చింది. 1995 -2000 మధ్య కాలంలో రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 1993 నుండి ఓ విద్యాసంస్థను నడుపుతున్నారు.అలాంటి వ్యక్తి విలువలన్నీ మరచి తీవ్ర ఆవేశంతో ఛానల్ మైకును లాక్కొని విలేకరి తలపై తీవ్రంగా కొట్టిన దృశ్యాలు అందరు చూశారు. 72 ఏళ్ల వయసులో సహనం, సంయమనాన్ని మరిచిన ఆయన ఈ దుశ్చర్యతో తీవ్ర విమర్శను ఎదుర్కోక తప్పలేదు. విలేకరులు రో÷-డడెక్కి ఆందోళన చేశారు. కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. 'మోహన్ బాబు పరారీ -పోలీసు బృందాల గాలింపు' అని టివి స్క్రోలింగ్స్ వచ్చాయి. ఐదు రోజుల తర్వాత ఆయన దిగి వచ్చి హాస్పిటల్‌కు వెళ్లి ఆ విలేకరి ముందు పశ్చాత్తాపం ప్రకటించక తప్పలేదు. ఇక ఇప్పుడు ఫోకస్ అంతా అల్లు అర్జున్‌పై పడింది. పుష్ప 2 ప్రీమియర్ షోకు వచ్చిన ఓ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. హీరో అల్లు అర్జున్ రాకతో ఏర్పడ్డ తొక్కిసలాటలో ఇల్లాలు చనిపోగా, ఓ బాలుడు చావు బతుకుల్లో ఉన్నాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల్లో అల్లు అర్జున్ పేరు కూడా చేర్చారు. 13వ తేదీన ఆయనను పోలీసులు అరెస్టు చేసి చంచల్ గూడ జైలుకు తరలించగా అదే రోజు సాయంత్రం మధ్యంతర బెయిల్ లభించింది. 14 ఉదయం విడుదలై ఇంటికి చేరుకున్నారు. విషాదంలో ఉన్న కుటుంబాన్ని హీరో పరామర్శించకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. దీనికి తోడు ఆయన అరెస్టు, విడుదలపై సినీ పరిశ్రమ చేస్తున్న సందడి అతిగా ఉందని అంటున్నారు. అయితే రకరకాల వీడియో క్లిప్పింగ్స్‌తో నెటిజన్లు ఈ సందర్భానికి రాజకీయ రంగు పులుముతున్నారు. సినిమా కార్యక్రమంలో అల్లు అర్జున్ తెలంగాణ ముఖ్యమంత్రి పేరును మరిచిపోయి తడబడడం ఒక వీడియోలో ఉంది. ఈ అరెస్టుతో రేవంత్ బదులు తీసుకున్నాడని చెప్పుకుంటున్నారు. సినిమా పరిశ్రమలో బలమైన ఈ కుటుంబం రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను తికమక పెట్టినా ఆశ్చర్యం లేదు. అల్లు అర్జున్ అరెస్టు విడుదల చూస్తుంటే రాష్ట్రం లోపలేస్తే కేంద్రం విడిపించినట్లుంది. ఇదే కోణంలో విభేదాలు పెరగవచ్చు. ఈ సంఘటనల నేపథ్యంలో- ఘత్తు వ్యాపారంగా మారిన సినీ పరిశ్రమ పై ప్రభుత్వం కఠినంగానే ఉండాలి. ప్రీమియర్ షోలు, మొదటి వారాల ప్రదర్శనల టికెట్ల ధరల పెంపు, భారీ ప్రమోషన్ ఫంక్షన్లకు అనుమతి లాంటి విషయాలను పునఃసమీక్షించాలి. పుష్ప తొక్కిస లాట తర్వాత ఇకపై స్పెషల్ షోలు, అధిక ధరలు ఉండవని మంత్రి కోమటి రెడ్డి అన్నట్లు వార్తల్లో వచ్చింది. ప్రభుత్వం దానికి కట్టుబడి ఉంటుందో లేదో చూడాలి. ఉంటే మాత్రం ప్రేక్షకుల బాధలు తీరటమే కాదు పరిశ్రమకు కూడా అది మేలే చేస్తుంది.

# సంపాదకీయం

## డాలర్ డ్రీమ్సేనా..?

అమెరికా 47వ అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌లో అడుగుపెట్టిన డొనాల్డ్ ట్రంప్ తొలి రోజే పలు సంచలనాలకు తెరతీశారు. ఎన్నికల ప్ర చార సమయంలో హామీ ఇచ్చినట్లుగా అక్రమ వలసలను అరికట్టడంతో పాటుగా పదుల సంఖ్యలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో అత్యం త ప్రధానమైనది 'జన్మతః పౌరసత్వం'పై వేటు. దాదాపు వందేళ్లుగా అనుసరిస్తూ వస్తున్న ఈ విధానానికి ట్రంప్ స్వస్తి పలికారు.అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతల చేపట్టిన వెంటనే అక్రమ వలసలపై డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన లక్షల మంది విదేశీయులను ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికాకు అక్రమంగా వచ్చినవారిని వెనక్కి పంపడం ఖాయమని ట్రంప్ చేసిన ప్రకటన వణికిస్తోంది. తాత్కాలిక వీసాలపై వచ్చినవారిదీ ఇదే పరిస్థితి. సరైన పత్రాల్లేకుండా అమెరికాలో నివసిస్తున్న విదేశీ పౌరుల సంఖ్య దాదాపు 1.40 కోట్లు ఉంటుందని అంచనా. వీరిలో సుమారు 7.25 లక్షల మంది భారతీయులే. మెక్సికో, ఎల్ సాల్వెడార్ పౌరుల తర్వాతి స్థానం మనోళ్లదే. ఈ నిర్ణయం ప్ర భావం అమెరికాలో ఉంటున్న లక్షలాదిమంది భారతీయులపై తీవ్ర ప్రభా వం చూపించనుంది. అక్రమంగా అమెరికాలో ఉంటున్న వారితో పాటుగా విద్యార్థులు, టూరిస్టు, హెచ్1బీ లాంటి తాత్కాలిక వర్క్ వీసాలపై దే శంలో ఉంటున్న వారికి జన్మించే పిల్లలకు ఇకపై అమెరికా పౌరసత్వం ల భించదు. ఈ తరహా పౌరసత్వాన్ని ఏ దేశం కూడా ఇవ్వడం లేదని, తాముకూడా ఇచ్చేది లేదని ట్రంప్ స్పష్టం చేశారుతల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరై నా అమెరికా పౌరసత్వం, శాశ్వత నివాసం, గ్రీన్‌కార్డు, అమెరికా మిలిటరీ సభ్యత్వం ఇలా ఏదైనా ఒక గుర్తింపు ఉంటేనే వారి పిల్లలకు పుట్టుకతో దే శ పౌరసత్వం ఇస్తామని తేల్చి చెప్పారు. అయితే అమెరికా మాత్రమే ఇలాంటి పౌరసత్వం ఇస్తున్నట్లు ట్రంప్ చెప్పిన దాంట్లో నిజం లేదు. ప్రపంచవ్యాప్తంగా 30కి పైగా దేశాలు ఇలా పౌరసత్వాన్ని ఇస్తున్నాయి. అమె రికాలో అంతర్యుద్ధం ముగిసిన మూడేళ్ల తర్వాత 1868లో ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణతో ఈ హక్కు లభించిందశరణార్థులుగా వచ్చిన నల్లజాతివారిని బానిసలుగా చూసే దుష్ట సంప్రదాయానికి ముగింపు పలకడానికి ఇది వీలు కల్పించింది. ఇప్పుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో ఇది రద్దు కానుంది. ఈ ఉత్తర్వు 30 రోజుల తర్వాతినుంచి అమలులోకి రానుంది. అయితే చట్టబద్ధంగా ఇది అమలు కావడం అసాధ్యమని నిపుణులు అంటున్నారు. ట్రంప్ ఉత్తర్వులను న్యాయస్థానాలు రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించే అవకాశం ఉందిఅమెరికా సుప్రీంకోర్టు సైతం జన్మతః పౌరసత్వాన్ని సమర్థించింది. ఆ అవకాశాలు లేకపోలేదని ట్రంప్ కూడా చెప్పడం గమనార్హం. అంతేకాదు ఉత్తర్వు అమలుకు రాజ్యాంగ సవరణ అవసరం. అమెరికా పార్లమెంటులోని ఉభయ సభలు మూడింట రెండు వంతుల మెజారిటీతో సవరణను ఆమోదించాలి. ఇది సుదీర్ఘ ప్రక్రియ. మరోవైపు ట్రంప్ నిర్ణయాన్ని న్యాయస్థానాల్లో సవాలు చేసేందుకు హక్కుల సంఘాలు సిద్ధమవుతున్నాయి.ఇదంతా అటుంచితే దీని ప్రభావం భారతీయులపై తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. 2024 నాటికి అమెరికాలో దాదాపు 54లక్షల మంది భారతీయులు ఉన్నారు. దేశ జనాభాలో 1.47 శాతానికి ఇది సమానం. వీరిలో 34 శాతం మంది అమెరికాలో పుట్టిన వారు కాగా, మిగతా వా రంతా వలస వచ్చిన వారే. అందులో ఎక్కువమంది హెచ్1బీ వీసా కింద వచ్చిన వారే.వాస్తవానికి అమెరికా వెళ్లిన భారతీయుల్లో చాలామంది తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం పొందేందుకు 'బర్త్ టూరిజం'ను అంటే పిల్లలకు జన్మనివ్వడం కోసమే అమెరికాకు వెళ్లడాన్ని ఒక మార్గంగా ఎంచుకొంటున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. మెక్సికో, చైనాలాంటి దేశాల వారూ ఇదే పద్ధతి అనురిస్తున్నారు. అందులో కొంత వాస్తవం లేకపోలేదు. ఎందుకంటే గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా అది దక్కా లంటే ఏళ్ల తరబడి వేచిచూడాలి.అందుకే తమ పిల్లలకు, తద్వారా తమ కూ అమెరికా పౌరసత్వం దక్కేందుకు ఈ మార్గాన్ని ఎంచుకొంటున్నారు. ఇప్పటికే ఇలా అమెరికాలో పుట్టిన పిల్లలు వేల సంఖ్యలో ఉ న్నారు. వీరు కూడా అమెరికాలోనే ఉండాలంటే చదువుతో పాటుగా అన్ని విషయాల్లో ను ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది.అలాగని కుటుంబాలు వేరుపడడం కూడా సాధ్యం కాదు. స్వదేశానికి తిరిగి వెళ్లడం ఒక్కటే మార్గం. ట్రంప్ కోరుకొంటున్నది కూడా అదే. అయితే దేశంలోని అన్ని వ్యవస్థలపైనా దీని ప్రభావం పడుతుందనేది నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమ వలసలను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో ఎమర్జెన్సీ విధించి.. మరిన్ని బలగాలను మోహరిస్తామని ట్రంప్ ప్రకటించారు. చట్టవిరుద్ధంగా నివసిస్తున్న విదేశీ పౌరులను అందర్నీ గుర్తించి.. వారిని తిరిగి వారి వారి దేశాలకు పంపించేందుకు ట్రంప్ యంత్రాంగం చర్యలు మొదలుపెట్టింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం కూడా ట్రంప్ సర్కారుతో కలిసి పనిచేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ట్రంప్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని మోదీ ప్రభుత్వం భావిస్తోం దని.. ట్రంప్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందని.. తత్ఫలితంగా వాణిజ్య యుద్ధాన్ని నివారించేందుకు,ట్రంప్‌నకు సహకరించేందుకు ఇది ముందస్తు ఆలోచన అని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# తెలంగాణలో త్వరలో శివసేన పార్టీ.. ప్రభంజనం సృష్టిస్తుంది..

### శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ



**హైదరాబాద్, జూలై 03, (తెలంగాణ దిశ) :**శివసేన ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ సైన్యం తయారు చేస్తామని శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిమాణాలపై గురువారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గర్వ్ సే కహెూ హమ్ హిందూ హై...అనే నినాదంతో తెలంగాణలో ప్రజలల్లోకి వెళ్తామన్నారు. ధర్మం కోసం దేశం కోసం కొట్లాడుతామన్నారు. త్వరలో వివిధ పార్టీల నుంచి శివసేన పార్టీలోకి భారీగా చేరికలు ఉంటాయని స్పష్టం చేశారు. శివసేన పార్టీ హిందుత్వం కోసం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు.
శివసేన పార్టీ మెజార్టీ ప్రజలైన హిందువుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. దేశం కోసం ధర్మం కోసం పనిచేసేందుకు ఎవరైనా శివసేన పార్టీలో చేరొచ్చునని అన్నారు. పార్టీ బలోపేతం కోసం కర్యకర్తలు కృషి చేయాలన్నారు. యువ నాయకత్వం బలపడేందుకు పార్టీ కట్టుబడి ఉందన్నారు. రాజకీయ లబ్ధిని పక్కకు పెట్టి దేశం కోసం ధర్మం కోసం కొట్లాడే గొప్ప పార్టీ శివసేన మాత్రమేనని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో శివసేన పార్టీ సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల పైన పూర్తి కార్యాచరణ సిద్ధం చేసామని అన్నారు.శివసేన పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో ఏ విధంగా పాగ వేయాలో బాగా తెలుసునని అన్నారు. శాసన సభ, లోక్ సభ ఎన్నికలలో పార్టీ పోటీ చేయని కారణంగా ఎంతగానో నష్టపోయిందన్నారు. ఎన్ డిఎ కూటమిలో ఉన్నందుకు సంపూర్ణ మద్దతుగా బీజేపీకి పనిచేస్తామని చెప్పారు. రానున్న రోజులలో ఎలాంటి పొత్తులు ఉండవన్నారు. మారుమూల గ్రామాలలో హిందూ ధర్మం కోసం పోరాటం చేస్తున్న పోరాట యోధులను కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు.గ్రామ గ్రామాన ధర్మ రక్షకులకు అండగా నిలబడేందుకు శివసేన సిద్ధమవుతుందని అన్నారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన చెప్పారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రజల హక్కుల కోసం ప్రజా ఉద్యమం చేస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ హామీల అమలు కోసం కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

# సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి : ఎమ్మెల్సీ సత్యం





**కుత్బుల్లాపూర్, జూలై 03, (తెలంగాణ దిశ) :**సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను ఆగష్టు 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో నిర్వహిస్తున్నామని సిపిఐ ఎమ్మెల్సీ సత్యం తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని అన్ని మండలాల నుండి ఎంపిక చేసిన వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని వివరించారు. రాష్ట్ర మహాసభల విజయవంతం కొరకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగా గురువారం సిపిఐ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు ఎమ్మెల్సీ సత్యంను శాలువాతో సత్కరించచారు. మహాసభల విజయవంతం కోసం తన వంతుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్, జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, మండల కార్యదర్శి స్వామి పాలాభిందల శ్రీనివాస్, సిపిఐ నాయకులు వి. శ్రీనివాస్, హరినాథ్, నర్సింహా రెడ్డి, యాదయ్య, జంబూ తదితరులు పాల్గొన్నారు

# నిజాంపేట్ లో సమస్యలను పరిష్కరించాలి



**కుత్బుల్లాపూర్, జూలై 03, (తెలంగాణ దిశ) :**భారతీయ జనతా పార్టీ నిజాంపేట్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో నిజాంపేట్ లోని పలు సమస్యలను ఎంపి ఈటల రాజేందర్ తో చర్చించి వారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీ నిధుల కింద కొన్ని పనులను పూర్తి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, ఎస్ సి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ రచ్చ చక్రధర్, బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సచిన్, కోశాధికారి శ్రీనాథ్, కార్యదర్శి బాబు చౌదరి, సురేష్, ఐటీ సెల్ కన్వీనర్ కిషన్, ఎక్స్ సర్వీస్ సెల్ కన్వీనర్ ఈశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన





**దమ్మాయిగూడ, జూలై 03, (తెలంగాణ దిశ) :** వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని రాంపల్లి దాయరలో కాలనీ ప్రజలకు డెంగ్యూ, మలేరియా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వన మహోత్సవంలో భాగంగా 15వ వార్డులో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి మున్సిపల్ సిబ్బందితో కలిసి 230 మొక్కలు నాటారు. ఇంటింటికీ తడి, పొడి వ్యర్థాల వేరు చేయడంపై అవగాహన కల్పించారు. వీధి పెంపుడు కుక్కలపై ఎబిసి ప్రచారం నిర్వహించారు. రోజువారి కార్యక్రమాలతో పాటుగా వాణిజ్య లైసెన్స్ లు, భువన్ సర్వే, పబ్లిక్ టాయిలెట్ సందర్శన, భూగర్భ మురికి కాలువలో చెత్త తొలగింపు, రోడ్డుకు ఇరుపక్కలో ఉన్న చెత్తను మరియు పొదలు తొలగింపు చేయడం జరిగింది. మెయిన్ రోడ్డు లో గుంతలు ఎక్కువగా ఉన్న చోట సీసీ మొరంతో గుంతలు పూడ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన, భువన్ సర్వే యాప్ లో ఆస్తులు నమోదు పరిశీలన వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, డిఈఈ ఎస్. బాల మురళి, మున్సిపల్ మేనేజర్ ఎ. వెంకటేష్, సానిటరీ ఇన్స్ పెక్టర్ కె. ప్రభు, వార్డు ఆఫీసర్స్, స్నేహ సంఘల మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావుకు అభినందనల వెల్లువ

**నాగారం, జూలై 03, (తెలంగాణ దిశ) :**బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ ను గురువారం బిజెపి నాగారం మున్సిపల్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, బిజెపి నాగారం మున్సిపల్ అధ్యక్షులు నాగరాజు, మహిళ మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, మాజీ జెడ్ పిటిసి సురేష్,నాయకులు శ్యాంసుందర్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, రవీందర్ రెడ్డి, అక్కల సురేష్, ముద్రగణం శ్రీనివాస్ యాదవ్, కొడిమాల కొండల్ రెడ్డి, నరేష్, వెంకటేశ్వరరావు, వేణు, మహిళా మోర్చా నాగారం అధ్యక్షురాలు జ్యోతి పాండే, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకే..!?

చారిత్రాత్మక రైతు ఉద్యమం జరిగి మూడు సంవత్సరాలు దాటింది. 13 మాసాల పాటు ఢిల్లీ పరిసరాలు కేంద్రంగా దేశవ్యాప్తంగా జరిగిన పోరాటం ముగింపు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఎస్‌కెఎమ్ నాయకత్వానికి రాతపూర్వకంగా హామీ ఇచ్చింది. అప్రజాస్వామి కంగా తెచ్చిన మూడు చట్టాలు రద్దు చేస్తామని, సి2ం50 శాతం మద్దతు ధరలు చట్టం చేస్తామని, విద్యుత్ చట్ట సవరణ బిల్లు రైతు సంఘాలతో చర్చించి నిర్ణయిస్తామని, ఉద్యమం సందర్భంగా అసువులు బాసిన రైతు కుటుంబాలకు పరిహారం ఇస్తామని ఎస్‌కెఎమ్ నాయకత్వానికి రాతపూర్వకంగా ఇచ్చింది. చట్టాలను వెనక్కి తీసుకుంది. మిగతా హామీలను అమలు పరచకుండా మూడు చట్టాల రూపకర్తలతోను, ఆ విధానాల మద్దతుదారులతోనూ కమిటీని ఏర్పాటు చేసింది. వ్యవసాయ అనుబంధ రంగాలన్నిటిలో అదానీ, అంబానీ కంపెనీల ఉద్యోగులను సలహాదారులుగా నియమించింది. మూడవసారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం కొత్తగా మూడు పథకాలను ప్రకటించింది. ఈ మూడు పథకాల సారాంశం మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే ధ్యేయంగా ఉన్నాయి. వాస్తవానికి రద్దయిన చట్టాల కన్నా ఘోరంగా ఉన్నాయి. ఈ స్థితిలో ఎస్‌కెఎమ్ నాయకత్వం మరొక దీర్ఘకాల ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నది. ఈ క్రమంలో రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 14న చర్చలకు సిద్ధమయింది. డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్: డిజిటల్ రంగంలో విద్య, ఆరోగ్యం, ఆర్థిక, రిటైల్ రంగాలలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని పేర్కొంది. సాంప్రదాయ వ్యవసాయాన్ని సాంకేతిక వ్యవసాయంగా మార్చడం లక్ష్యంగా ప్రకటించింది. మన వ్యవసాయ రంగం ప్రపంచంలో పాడి, జ్యూట్ పప్పుధాన్యాలు ఉత్పత్తిలో మొదటి స్థానంలో, గోధుమ, వరి, వేరుశనగ, కూరగాయలు, పళ్ళు,పత్తి, చెరకు ఉత్పత్తిలో రెండవ స్థానంలో ఉన్నప్పటికీ%ొ%చిన్న కమతాల వల్ల సరిపడా ఆదాయం రావడంలేదని పేర్కొంది. వాతావరణ సస్యరక్షణ, సాగునీటి వ్యవస్థ, అధిక ఎరువుల వాడకం సమస్యలు ఎదుర్కొంటున్నదని డిజిటల్ టెక్నాలజీతోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అవుతుందని పేర్కొంది.

# ట్రంపరితనంతో... లాభమెంత.. నష్టమెంత..?

ఢిల్లీ,: ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కొంద రికి నచ్చకపోవ చ్చు...కానీ అమెరికన్లకు మాత్రం నచ్చి తీరుతుంది. అమెరికా ఫస్ట్ అన్న ఆయన నినాదం బాగా ప్రాచుర్యం పొందింది. ఏ పాల కుడైనా తమ దేశ ప్రయోజనా లను మాత్రమే చూస్తారు. అందుకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటారు. ట్రంప్ కూడా ఇప్పుడు అదేవిధమైన విధానాలతో ముందుకు సాగుతు న్నారు. కాకపోతే అమెరికాపై చాలామింది ఆధారపడి బతుకుతున్నందున వారికి ఇవి నచ్చకపోవచ్చు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ పిల్లలను కని, వారిని అమెరికా పౌరులు చేస్తామంటే ఎవ్వరికైనా మండుతుంది. ట్రంప్ కు అక్కడే మండింది. అందుకే జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేశారు. ఉద్యోగాలు కూడా స్థానికులకే ఇవ్వాలన్నది ఆయన మొదటి నుంచి పట్టుబడుతున్న వ్యవహారమే. హెచ్-1 వీసాల విషయంలోనూ ముఖ్యంగా భారతీయుల్లో ఆందోళన నెలకొంది. మాకు దక్కాల్సిన ఉద్యో గాలను ఎగరేసుకుని పోతున్నారని అమెరికన్లు ఎప్పటి నుంచే గగ్గోలు పెడుతున్నారు. ఇవన్నీ కూడా ట్రంపం ఎన్నికల ప్రచారంలో బాగా ప్రాచుర్యం పొందినవే. అమెరికాకు అనుగుణం గా ట్రంప నిర్ణయాలు తీసుకుంటున్నారు. వీటిని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇవి మనకు అనుకూలంగా లేవు కనక మనం బధపడుతున్నారు. అమెరికా ఫస్ట్ అన్న ఆయన నినాదం మేరకు నిర్ణయాలు ఉంటాయని తెలియచేస్తున్నారు. అలా అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసీ చేయగానే ట్రంప్ తను గతంలో ప్రకటించిన మేరకు నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారు. అందులో ఒకటి- పారిస్ ఒప్పందం నుంచి మళ్లీ బయటకు రావడం. పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడతానంటూ తొలిరోజు ప్రసంగంలో దేశ ప్రజలకు హామీ ఇచ్చిన ట్రంప్.. భూతాపానికి ముకుతాడు వేసేందుకు 190కి పైగా దేశాలు ఒక్కతాటిపైకి వచ్చి కుదుర్చుకున్న ఒడంబడికనుంచి వైదొలగడంమిగతా ప్రపంచ దేశాలకు నచ్చలేదు. అందుకే అమెరికాకు తొలిసారి అధ్యక్షుడయ్యాక ట్రంప్ ఈ ఒప్పందంనుంచి వైదొలగడంతో ప్రపంచ దేశాలన్నీ ఆందోళన వెలిబుచ్చాయి. దూకుడుతనానికీ, దుందుడుకు స్వభావానికి డొనాల్డ్ ట్రంప్ పెట్టింది పేరు. అలా ఉండటమే తనకు రెండోసారి అధ్యక్ష పదవిని కట్టబెట్టిందని ఆయన ప్రగాఢంగా విశ్వసిస్తారు. కీలకమైన పారిస్ ఒప్పందం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకున్న బైడెన్, తాను అధికారంలోకి వచ్చాక 2021లో మళ్లీ ఒప్పందంలో అమెరికాను చేర్చారు. తాను పట్టిన కుందేటికి మూడేకాళ్లు అని నిర్ద్వంద్వంగా, నిస్సంకోచంగా వాదించే ట్రంప్ మళ్లీ అధ్యక్షుడు కాగానే ఈ ఒప్పందాన్ని కాలరాచేందుకు ఉద్యుక్తుడయ్యారు. అంతేకాదు, కొవిడ్ వ్యాప్తి సమయంలో బాధ్యతారహితంగా ప్రవర్తించిందనే ఆగ్రహంతో ప్రపంచ ఆరోగ్య సంస్థనుంచి కూడా వైదొలగుతూ ఆయన నిర్ణయం తీసుకోవ డం జరిగింది. దీనివల్ల అమెరికాకు వచ్చే లాభం ఎంతన్నది ఆయన చేస్తున్న వాదనగా ఉంది.కృత్రిమ మేధ విస్తరిస్తే మనవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని, బైడెన్ ప్రభుత్వం దీని విస్తరణపై విధించిన ఆంక్షలను తాజాగా ట్రంప్ తొలగించారు. కీలకమైన అంశాలపై లోతైన అధ్యయనం, విస్తృతమైన చర్చలు.. ఏవీ లేకుండా వచ్చీరాగానే కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేయడం ఆయన తొందరపాటుకు నిదర్శనమనే చెప్పాలి.

# ఆర్ఎఫ్‌సీఎల్‌లో వారం రోజుల్లో ఉత్పత్తి పునరుద్ధరణ!

**గంగాధర,తెలంగాణ దిశ:**ఏపీ, తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల్లోని రైతాంగానికి యూరియా కొరత నివారణలో కీలకపాత్ర పోషిస్తున్న రామగుండం ఎరువుల కర్మాగారంలో వార్షిక మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. వారం రోజుల్లో యూరియా ఉత్పత్తిని పునరుద్ధరించాలనే ప్రణాళికతో అధికారులు ముందుకు సాగుతున్నారు. సాధారణంగా ఏటా నవంబరులో కర్మాగారంలో ఉత్పత్తి నిలిపివేసి అవసరమైన విభాగాల్లో మరమ్మతులు చేపడుతారు. రానున్న ఏడాదికాలంపాటు నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటారు. ఈసారి నెల ముందుగానే మరమ్మతులు మొదలు పెట్టారు. వార్షిక మరమ్మతుల ప్రణాళిక ప్రకారం ఈ నెల 23న కర్మాగా రాన్ని తిరిగి ప్రారంభించనున్నారు. 26న యూరియా ఉత్పత్తి ప్రారంభం కానుంది. దీనికి అనుగుణంగా యూరియాను తరలించేందుకు రైల్వే వ్యాగన్ల షెడ్యూలు సైతం రూపొందించారు. కేవలం 15 రోజుల్లోనే వార్షిక మరమ్మతులు పూర్తిచేసి కర్మాగారాన్ని ఉత్పత్తి దశలోకి ప్రవేశపెట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రామగుండం ఎరువుల కర్మాగార ంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలోని మొదటి 6 నెలలు లక్ష్యానికి చేరువలో యూరియా ఉత్పత్తి కొనసాగగా.. సుమారుగా రూ.320 కోట్ల లాభాలను ఆర్జించినట్లుగా భావిస్తున్నారు. రామగుండం వార్షిక ఉత్పత్తి లక్ష్యం12.7 లక్షల మెట్రిక్ టన్నులు కాగా.. రానున్న ఆరు నెలల్లో ఇంకా 6.35 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి కావాల్సి ఉంది. వరుసగా మూడేళ్లు లాభాలను



ఆర్జించినట్లయితే సామాజిక బాధ్యతగా ప్రభావిత, పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఆర్ఎఫ్‌సీఎల్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.గత రెండేళ్లు లాభాలు ఆర్జించిన ఎరువులకర్మాగారం ఈ ఆర్థిక సంవత్సరం సైతం లాభాల బాటలో పయనిస్తుండటంతో.. 2025–26 నుంచి సీఎస్సార్ నిధులతో ఈ గడిచినఆరు నెలల్లో 6.17 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో ఎరువుల కర్మాగారం లక్ష్యానికి చేరువలో నిలిచింది. మొదటి త్రైమాసికం(ఏప్రిల్, మే, జూన్)లో రూ.168 కోట్ల లాభాలు గడించినట్లుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

## మోసం కొండంత.. వసూలు గోరంత!

# సవాలుగా జీఎస్టీ అక్రమాల కేసు




**కరీంనగర్,తెలంగాణ దిశ:** జగిత్యాల కేంద్రంగా జరిగిన జీఎస్టీ మోసం కథ ఎటూ తేల డం లేదు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోని ఐటీసీ (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) రూపంలో జరిగిన అక్రమ బాగోతం తాలూకు విచారణ ఇంకా నడుస్తూనే ఉంది. సుమారు 9 నెలల కిందట జగిత్యాలకు చెందిన జీఎస్టీ ప్రాక్టీషనర్ తప్పుడు ధ్రువపత్రాలతో బోగస్ సంస్థలను ఏర్పాటు చేసి దాదాపుగా రూ.288 కోట్ల ఆర్థిక మోసానికి పాల్పడ్డారని అధికారులు గుర్తించారు. కాగితాలపైనే సృష్టించిన పలు బోగస్ కంపెనీలకు ఆ సొమ్మును బదలాయించారు. ఈ అడ్డగోలు వ్యవహారాన్ని ఆలస్యంగా గుర్తించిన వాణిజ్య పన్నుల అధికారులు మొదట విస్తుపోయారు. తీరిగ్గా తేరుకుని బాధ్యుడిగా గుర్తించిన వ్యక్తి కార్యాలయంలో సోదాలు చేపట్టారు. పలు పత్రాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేసి అరెస్ట్ చేయించారు. తరువాత ఈ విచారణను హైదరాబాద్ నుంచి వచ్చిన వాణిజ్య పన్నుల శాఖ విజిలెన్స్ అధికారులు చేపట్టారు. తమ సంస్థలను మూసివేయమని జీఎస్టీ ప్రాక్టిషనర్ వద్దకు వచ్చిన కొందరు వ్యాపారుల ఆధార్ కార్డులను ఉపయోగించి ఆన్‌లైన్‌లో ఈ కుంభకోణానికి తెరతీసినట్లు విచారణలో గుర్తించారు. ఇలా 32 బోగస్ కంపెనీలను ఏర్పాటు చేసి సిమెంట్, ఐరన్ వ్యాపారాలు చేస్తున్నట్లు కాగితాల్లోనే నమ్మించాడు. ఆ బోగస్ సంస్థలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో జమ అయిన మొత్తం డబ్బులను 302 మంది వ్యాపారులకు బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. తెలంగాణలోని పలు ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన సంస్థలకు ఈ నగదు వెళ్లినట్లు గమనించారు. ఇందులో పెద్దమొత్తంలో ఒక సంస్థకు రూ.120 కోట్లు బదలాయింపు జరిగిన తీరు తెలుసుకుని అధికారులు నివ్వెరపోయారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఈ అక్రమంలో భాగమైన బాధ్యుడిని గుర్తించి పట్టుకున్నప్పటికీ.. పక్కదారి పట్టిన సొమ్మును తిరిగి వసూలు చేయడం అధికారులకు తలకు మించిన భారంగానే మారింది. ఇప్పటి వరకు గుర్తించిన పలువురు వ్యాపారులు, సంస్థల నుంచి రూ.13 కోట్లకుపైగా డబ్బును రాబట్టినట్లు తెలిసింది. మొత్తం మోసంలో ఇప్పటివరకు రికవరీ అయింది కేవలం 5 శాతమే. మూడు నెలల కిందటి వరకు రూ.11 కోట్లు రాగా.. ఇటీవల ఈ మొత్తం రూ.13 కోట్లను దాటినట్లు సమాచారం. జగిత్యాల కేంద్రంగా జరిగిన ఈ భారీ మోసాన్ని అప్పట్లో సవాలుగా తీసుకున్న అధికారులు కాలక్రమేణా ఇతర పనుల్లో తీరిక లేకుండా పోవడంతో విచారణలో దూకుడు ప్రదర్శించడం లేదన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా పోలీసులు, వాణిజ్య పన్నుల అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే ఇంకా ఇందులో భాగమైన వారెవరనేది బాహ్య ప్రపంచానికి తెలిసే అవకాశముంది.

పైగా రాష్ట్రంలోనే బోగస్ సంస్థలు ఏర్పాటు చేసి సొమ్మును బదలాయించినట్లు గుర్తించిన అధికారులు అందులో కొందరికి సర్‌ఛార్జ్ నోటీసులు అందించినట్లు తెలుస్తోంది. తరువాత రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టాన్ని ఉపయోగించి పోయిన నగదును తిరిగి చేజిక్కించుకునే విషయమై కసరత్తు చేసింది. పూర్తిస్థాయిలో మోసపోయిన సొమ్మును వసూలు చేయడం కష్టసాధ్యంగా ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయమై వాణిజ్య పన్నుల శాఖ కరీంనగర్ డివిజన్ జాయింట్ కమిషనర్ రవికుమార్‌ను సంప్రదించగా రికవరీ ఎంత చేశారనేది ఈ కేసుని పర్యవేక్షిస్తున్న హైదరాబాద్‌లోని అధికారులకే తెలుస్తుందన్నారు.

## చెన్నాపురం-గోరుకొండ మధ్యలో పేలిన మందుపాతర

**చర్ల,తెలంగాణ దిశ:** చర్ల మండలంలోని చెన్నాపురం–గోరుకొండ మధ్యలో పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు డైరెక్షన్ మైన్(మందుపాతర) ను పేల్చారు. ఈ ఘటనలో స్పెషల్ పార్టీకి చెందిన ఓ పోలీసుకు స్వల్ప గాయాల య్యాయి. సీఐ రాజువర్మ నేతృత్వంలోని పోలీసు బృందం చర్ల మండల ంచెన్నాపురం బేస్ క్యాంపునకు వెళ్లి వెనుదిరిగారు. ఈక్రమంలో గోరుకొండకు సుమారు కి.మీ. పరిధిలోని అటవీ మార్గం లో మలుపు వద్ద అంబూష్ వేసిన మావోయిస్టులు ఒక్కసారిగా రహదారి పక్కన పెట్టిన డైరెక్షన్ మైన్‌ను పేల్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ ఘటనలో స్పెషల్ పార్టీ పోలీసుకు స్వల్పగాయాలయ్యాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఈఘటనపై కేసు నమోదు చేసిదర్యాప్తు జరుపుతున్నామని సీఐ రాజువర్మ తెలిపారు. కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరానికి చెందిన మనోహర్, విజ యలక్ష్మి, సురేష్, వేణు, సునీత, భద్రాచలానికి చెందిన నాగసుధీర్, సారపాకకు చెందిన రామకృష్ణ, మరిపెడబంగ్లాకు



చెందిన విజయ్‌కుమార్, మహబూబాబాద్‌కు చెందిన రమేష్‌పై కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. కర్నూలుకు చెందిన వెంకన్న వద్ద వీరంతా మసాలాలు కొనుగోలు చేశారు. రూ.26,31,760 చెల్లించినట్లు నకిలీ బ్యాంకు చలాన్లు పంపి మోసగించారు. బాధితుడు ఈనెల కర్నూలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# నిర్వహణ లోపం.. నీరే గరళం

### ట్యాంకులు శుభ్రపరచక కలుషితం
### వ్యాధులు ప్రబలుతున్నా చర్యలు కరవు

**పెద్దపల్లి,తెలంగాణ దిశ:**నెలలో మూడు సార్లు ట్యాంకులను శుభ్రం చేయాలనే నిబంధన లున్నా జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. పాత పథకాలు 352 ఉండగా మిషన్ భగీరథలో మరో 354 నిర్మించి సరఫరా చేస్తున్నారు. బ్లీచింగ్‌పౌడర్‌తో ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉండగా మొక్కుబడి తంతు కొనసాగిస్తున్నారు. ట్యాంకులకు పగుళ్లు ఏర్పడి లీకవుతున్నాయి. చాలా చోట్ల వాసన వస్తున్న నీటిని జనం తాగడం లేదు. మొత్తం 265 పంచాయతీల్లో 1,100 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. చెత్త తొలగింపు, మురుగుకాలువల శుభ్రతకే వీరు పరిమితమవుతున్నారు. రెండు నుంచి నాలుగు ట్యాంకులున్న పెద్ద పంచాయతీల్లో ఇబ్బందులు అధికంగా ఉంటున్నాయి. పంచాయతీలకు నెలల తరబడి నిధుల విడుదల లేక బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ట్యాంకు అడుగు భాగంలో బురద మండలకేంద్రంలో అయిదు బావులు, నాలుగు ట్యాంకులున్నాయి. మిషన్ భగీరథ జలాలు అందని బీసీ, ఎస్టీ కాలనీలకు ఊరకుంట చెరువు పక్కనున్న ట్యాంకు, బావి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఎప్పుడో ఒకసారి ట్యాంకును చేస్తున్నారని బీసీ కాలనీవాసులు తెలిపారు. ట్యాంకు పల్లపు ప్రాంతంలో ఉండటంతో ఎప్పుడూ నీరు నిలిచే ఉంటోంది. అందులో పందులు పొర్లుతూ అపరిశుభ్రత నెలకొంది. పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి



సరఫరా విషయమై బ్లీచింగ్, క్లోరినేషన్, ట్యాంకుల శుద్ధి, బల్క్ వాటర్ సప్లై, లీకేజీలు, ఫిర్యాదులు,

కొత్త కనెక్షన్ల పేరిట ఏడు రిజిస్టర్లు నిర్వహిస్తున్నారు. ట్యాంకును ప్రతి నెలా 1, 13, 21 తేదీల్లో శుద్ధి చేయిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ తెలిపారు. పెద్దపల్లి పురపాలికలో 9 ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. 45 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేస్తున్నట్లు చెబుతున్నా బోర్డులపై తేదీలు రాయడం లేదు. స్థానికంగా నీటి పరీక్షలు నిర్వహించడం లేదు. కేవలం ముర్మూర్‌లోని భగీరథ పంపింగ్ కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తున్నారు. కుళాయి నుంచి సరఫరా ప్రారంభమైన కొద్దిసేపటివరకు నీరు మురికిగా వస్తోంది.

# రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణంలో జాప్యం..?



**మెట్‌పల్లి,తెలంగాణ దిశ:** గూడు లేని పేదలకు సౌకర్యవంతమైన సొంతిళు ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకం తీసుకొచ్చింది. లబ్ధిదారుల ఎంపిక పూర్తయి ఏళ్లు గడుస్తున్నా వారి సంఖ్యకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాల్లో ముందడుగు పడకపోవడంతో అర్హులకు నిరాశే ఎదురవుతోంది. ఇళ్లు పొందేందుకు అన్ని అర్హతలున్నా నిరీక్షణ తప్పడం లేదని పేదలు వాపోతున్నారు. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పురపాలికలతో పాటు మండలాల నుంచి రెండు పడక గదుల ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించి చాలా చోట్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. తొలి విడతలో ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు రూ.6.29 లక్షలు ఖర్చు చేయగా, రెండో విడతలో మాత్రం రూ.5.04 లక్షలు కేటాయించారు. జిల్లాకు మొత్తం 8,225 ఇళ్లు మంజూరవగా, 5,731 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 2,434 ఇళ్ల పనులు మొదలు కాలేదని తెలుస్తోంది. కాగా కొన్ని చోట్ల నిర్మాణాలు ప్రారంభించినా మధ్యలోనే నిలిచిపోయాయి. నిర్మాణ వ్యయం పెరగడం, బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో చాలా చోట్ల గుత్తేదారులు పనులను మధ్యలోనే వదిలేశారు. 305 ఇళ్లు ప్రగతిలో ఉండగా, అవి ఎప్పటికీ పూర్తవుతాయోనన్నది ప్రశ్నార్థకంగా మారింది.


జిల్లాలో కొన్నిచోట్ల లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించాల్సి ఉంది. అర్హులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించడంలో తాత్సారం జరుగుతోంది. కొన్నిచోట్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా సరిపడా ఇళ్లు నిర్మించక, పూర్తికాక ఎదురు చూపులు చూడాల్సి వస్తే, మరికొన్ని

చోట్ల ఇళ్లు పూర్తయినా అర్హుల ఎంపికలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 5,731 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా 4,653 మందికి కేటాయించా రు. ఇంకా మిగతా 1,078 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

# గుంటూరు కేంద్రంగా నకిలీ పురుగు మందులు

**దామరచర,తెలంగాణ దిశ:**ఏపీలోని గుంటూరు కేంద్రంగా పేరొందిన కంపెనీలపేరుతో తెలంగాణలోనకిలీ పురుగు మందుల సరఫరా జరుగుతున్నట్లు వ్యవసాయాధికారుల విచారణలో వెల్లడైంది. మిర్యాలగూడతో పాటు దామరచర్ల, అడవిదేవులపల్లి తదితర మండలాల పరిధిలో బ్రాండెడ్ కంపెనీ పేరుతో నకిలీవి రైతులకు విక్రయిస్తున్నారు.

దీనిపై ప్రముఖ సంస్థ కంపెనీ ప్రతినిధులు రెండ్రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో మొదట మిర్యాలగూడలోని ఓఫర్టిలైజర్స్, సీడ్స్ దుకాణంలో తనిఖీచేయగా ప్రముఖ కంపెనీపేరుతో గలనకిలీ పురుగు మందులు ఉన్నట్లు గుర్తించారు. రూ.52, 900 విలువైన 11కిలోల బరువుగల 23సాచెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదా రుడిని ప్రశ్నించగా.. ఓవ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించి డీలర్ నుంచి సరకు తమకు అందినట్లు తెలిపారు. సమాచారం ప్రకారం మండలంలోని వీర్లపాలెంలోని ఆగ్రోస్‌రైతు సేవా కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేయగా అక్కడా నకిలీవి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గుంటూరు నుంచి ధనావత్ రమేష్ ఈ ప్రాంతంలోని



పలు దుకాణాలకు నకిలీ మందులు సరఫరా చేస్తున్నట్లు ఓ దుకాణ యజమాని వివరించారు. డీఏవో మాట్లాడుతూ..

నకిలీవి విక్రయిస్తున్న దుకాణదారుల అనుమతులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కంపెనీలకు సంబంధించిన ఇన్వాయిస్‌లను రైతులకు చూపించాలని, కొ నుగోలు బిల్లులు అందించాలని ఆదేశించారు

# 3 రోజులు... 15 బెదిరింపు కాల్స్!

ముంబై: బాంబు పెట్టాం.. పేల్చిపారేస్తాం.. దమ్ముంటే కాపాడుకోండి..! అంటూ ఒక అజ్ఞాతవాసి నుంచి బెదిరింపు స్వరం. తీరాచూస్తే అంతా తూచ్. ఇదీ వరస. ఇంటర్నేషనల్, డొమెస్టిక్ ఫ్లైట్లన్న తేడా లేదు. ఉత్తుత్తి బెదిరింపులతో వేలాదిమంది ప్యాసింజర్లు బెంబేలెత్తిపోయారు. ప్రాణాలు గుప్పిట పట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి. అటు.. ఏవియేషన్ యంత్రాంగానికి్కూడా చుక్కలు కనిపించాయి.గత మూడు రోజుల్లోనే మొత్తం 15 బాంబ్ థ్రెట్స్ నమోదయ్యాయి.

బుధవారం.. ఈ ఒక్కరోజులోనే ఆరు విమానాలకు బాంబు బెదిరింపులొచ్చాయి. కాకపోతే అన్నీ ఫేకే..! అందరూ క్షేమం. మూడు ఇండిగో, రెండు స్పైస్‌జెట్.. ఒకటి ఆకాశ ఎయిర్.. మొత్తం ఆరు ఫ్లైట్లలో ప్రయాణికుల్ని బెంబేలెత్తించాయి బోగస్ ఫోన్‌కాల్స్.ఢిల్లీ నుంచి చికాగో వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం.. అగంతకుల బెదిరింపు కారణంగా దారిమళ్లి ంచాల్సి వచ్చింది.

సీక్రెట్‌గా ఒక రిమోట్ ఎయిర్‌పోర్ట్‌లో దింపి.. అందులోని 200 మంది ప్రయాణికుల్ని కాపాడారు. వీళ్లను ఎయిర్‌లిఫ్ట్ చేయడం కోసం..రాయల్ కెనడియన్ ఎయిర్‌ఫోర్స్‌కి చెందిన అఅ–330 యుద్ధ విమానాన్ని వాడారు.ఇటీవలే తిరుపతి విమానాశ్రయానికే బెదిరింపు లేఖ వచ్చింది. ఈ–మెయిల్ ద్వారా సీఐఎస్ఎఫ్ అధికార వెబ్‌సైట్‌కు పంపిన లేఖను గోప్యంగా ఉంచింది ఎయిర్‌పోర్టు

అథారిటీ. పోలీసులకు ఫిర్యాదు చేసి, ఈ–మెయిల్ ఆధారంగా నిందితుడ్ని పట్టుకునే ప్రయత్నం జరుగుతోంది.ఒకవైపు ప్యాసింజర్లకు అసౌకర్యం.. మరోవైపు ఫ్లయిట్ షెడ్యూల్స్ మార్చాల్సి రావడం..! ఫేక్ కాల్స్‌తో ఈ హైరానా పడలేకున్నాం అంటూ ప్రైవేట్ ఎయిర్‌లైన్ సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెరుగుతోంది.




## గుంతల దారికి సుంకం చెల్లించాలా?

**కాటారం,తెలంగాణ దిశ:** జాతీయ రహదారుల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం వివిధ ఏ జెన్సీలకు దారి సుంకం వసూలు అప్పగిస్తోంది. 353(సీ) జాతీయ రహదారిపై మేడిపల్లి వద్ద వసూలు కేంద్రం(టోల్ ప్లాజా) ఏర్పాటుచేశారు. కొద్ది రోజుల్లో దీన్ని ప్రారంభించబోతుండగా, ప్రస్తుతం ట్రయల్ రన్‌ని ర్వహిస్తున్నారు. ఏ వాహనానికి ఎంత టోల్ పన్ను వసూలు చేయాలనేది ఇప్పటికే నిర్ణయించారు. అయితే రహదారి నిర్వహణ అధ్వా నంగా మారి, గుంతలు పడి ఇబ్బందులు పడుతున్నా.. దారి సుంకం చెల్లించాలా అని వాహనదారులు వాపోతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో ఈ దారి అక్కడక్కడా కుంగిపోగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిని మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

# విలువైన భూముల్లో అక్రమ కట్టడాలు

**గంగాధర,తెలంగాణ దిశ:**పట్టా భూములైనా, సర్కారు భూములైనా కబ్జాకు కాదేది అనర్హమంటూ ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. మారుమూల పల్లెల్లో సైతం గుంట స్థలం రూ.లక్షల్లో ధరలకు రెక్కలు రావడంతో ఇక వాణిజ్య స్థలాలను వదలిపెట్టడంలేదు. ఇందుకు చెరువులు, కుంటల శిఖం భూములతోపాటు సాగునీటి కాలువలను సైతం కబ్జా చేస్తున్నారు. అక్రమ కట్టడాలకు పాల్పడుతుండగా అవి కాస్తా కుచించకపోయి వాటి ఉనికికే ప్రమాదం ఏర్పడింది.గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం పరిధిలో మంగపేట ఎల్లమ్మ చెరువు నుంచి వేములవాడకు కుడి కాలువ 19 కి.మీ ఇప్పటికే పూర్తి చేశారు. కాలువ 60 మీటర్ల వెడల్పుతో నిర్మించగా కుడి వైపు దారికి 4 మీటర్లు, ఎడమ వైపు దారికి 6 మీటర్ల స్థలం వదిలిపెట్టారు. ఇక వాణిజ్య కేంద్రంగా ఉన్న గంగాధర ప్రధాన కూడలిలో మాత్రం 1.6 కి.మీ పొడవునా 45 మీటర్ల వెడల్పుతో ఇరువైపులా దారులకు స్థలం వదిలి కాలువ తవ్వారు. ఈ కాలువ పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీలు, వాటికింద ఉపకాలువల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టారు. ఇక ర్యాలపల్లి వైపు ఎడమకాలువ 20.5 కి.మీ 40 మీటర్ల వెడల్పుతో పూర్తి చేయగా దానికింద 10 ఉపకాలువలు తవ్వారు. భూసేకరణ జరిపి బాధితులకు అప్పటికే నష్టపరిహారం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కాలువ పక్కనున్న భూములు పంటలకు అనువుగా ఉండి కొందరు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందిన గంగాధర ప్రధాన కూడలి (మధురానగర్ గ్రామ పంచాయతీ)లో గుంట స్థలం కనీస ధర రూ.15 లక్షలు పలుకుతుండగా కబ్జారాయుళ్ల కన్నుపడింది. గంగాధర ప్రధాన కూడలి నుంచి కురిక్యాల రెవెన్యూ శివారు (పిట్టలపల్లి) వరకు 1.6 కి.మీ వాణిజ్య కేంద్రంగా ఉండి ఇక్కడి భూములకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండు ఉంది. కొందరు కాలువ పక్కనున్న దారులను వదిలిపెట్టకుండా ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారు. గతంలో కాలువ నిర్మాణం జరుగుతుందని తెలిసి కొందరు అక్రమ కట్టడాలతో నష్టపరిహారం పొందగా, మరికొందరు కాలువ తవ్వకం జరిగి దారులకు వదిలిపెట్టిన స్థలాలు ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారు. ఇంకొందరు ఇదంతా తమదే స్థలమంటూ కాలువ భూములను అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటంతటికీ సాగు నీటిశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు న్నాయి. కాలువ నిర్మాణానికి భూసేకరణ జరిపిన అధికారులు అప్పట్లోనే హద్దులు నిర్ణయించి కంచె వేస్తే విలువైన భూములు కబ్జాకు గురయ్యే అవకాశం ఉండదనే



అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పటికే ఎల్లంపల్లి పైపులైన్ల వెంట దారులతోపాటు పైపులైన్ల పైభాగాన్ని ఆక్రమించి పంటలు వేస్తుండగా పైపులైన్లకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి కాలువల భూములు కాపాడాల్సిన అవసరముంది. నిర్మాణ దశలో ఉన్న కాలువ భూములు ఎవరు ఆక్రమించినా సర్వే చేసి తొలగిస్తాం. కాలువకు కుడి వైపు ఆరు మీటర్లు, ఎడమ వైపు 7 మీటర్ల దూరంలో మురుగుకాలువలు నిర్మించి దారులు వేయాల్సి ఉంది. ఇప్పటికే భూసేకరణ జరిపి నష్టపరిహారం కూడా అందజేశాం.

# రెంటల్ ఏ బాయ్.. ఆర్ గాళ్...!

న్యూఢిల్లీ,:ఎన్నో సంస్కృతులు, సంప్రదాయాలు, వింతలు ఈ ప్రపంచంలో ఉన్నాయి. ప్రదేశాలను బట్టివాటి సంప్రదాయాలు మారిపోతుంటాయి. ఇండియాతో పోలిస్తే మిగతా దేశాలు సంప్రదాయాలు వేర్వేరుగా ఉంటాయి. పాశ్చాత్య దేశాలు మన కంటే ఓ 20 ఏళ్లు ముందుగానే ఉంటాయని చెప్పవచ్చు. ఇండియాలో చూసుకుంటే ఎప్పుడో పాశ్చాత్య దేశాల్లో ఉండే కల్చర్ ఇప్పుడు ఇక్కడ ట్రెండ్ అవుతోంది. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బాయ్ ఫ్రెండ్, గర్ల్ ఫ్రెండ్ ఉండటం ఒక ట్రెండ్ అయిపోయింది. అసలు లవర్ ఉన్నవారిని కంటే లేని వారిని చూసే షాక్ అవుతున్నారు. అలా ట్రెండ్ మారింది. సాధారణంగా గదులు, దుస్తులు, సామానులు వంటివి అద్దెకి ఇస్తారు.

కానీ బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్‌ను అద్దెకు ఇస్తారనే విషయం మీకు తెలుసా? అయితే ఇది మన దేశంలో కాదు. అభివృద్ధిలో దూసుకుపోతున్న జపాన్‌లో గర్ల్ ఫ్రెండ్ లేదా బాయ్ ఫ్రెండ్‌ను రెంట్‌కి ఇస్తారు. పూర్తి వివరాల్లో తెలుసుకుందాం.ప్రతి ఒక్కరికి లైఫ్‌లో అన్ని విషయాలు షేర్ చేసుకునే ఒక వ్యక్తి ఉండాలని కోరుకుంటారు. వాళ్ల బాధలను ఎవరితో షేర్ చేసుకోకుండా మనస్సులోనే నలిగిపోతుంటారు. ఇలాంటి వారి బాధలను చూడలేక జపాన్ ప్రభుత్వం రెంట్ ఏ గర్ల్ ఫ్రెండ్ లేదా బాయ్ ఫ్రెండ్ విధానాన్ని తీసుకొచ్చింది. బాధలు షేర్ చేసుకోకపోవడం వల్ల ఒంటరితనానికి ఎక్కువగా బానిస అవుతున్నారు. దీని నుంచి విముక్తి కల్పించడానికి జపాన్ ప్రభుత్వం అద్దె పార్ట్‌నర్ పథకాన్ని ప్రారంభించింది. గంటలు లేదా రోజులు ఇలా పార్ట్‌నర్‌ను అద్దెకు తీసుకోవచ్చు. దీనికోసం ప్రభుత్వం కొన్ని వెబ్‌సైట్‌లను కూడా ప్రవేశపెట్టింది. అయితే ప్రభుత్వం అనుమతి ఉన్న వెబ్‌సైట్‌లలో మాత్రమే అద్దె తీసుకోవాలి. అయితే ఈ స్కీమ్‌లో ఎక్కువ ఖరీదుకే పార్ట్‌నర్‌లను అద్దెకు తీసుకోవాలి. కనీసం గంటకు రూ.3 వేల రూపాయిలు అద్దె కట్టాలి. రెండు గంటల పాటు తప్పకుండా బుక్ చేసుకోవాలిఈ స్కీమ్‌లో మొదటిసారి ఉచితమే. తర్వాత నుంచి మనమే బుక్ చేసుకోవాలి.

అయితే మీకు నచ్చిన అమ్మాయి రాదు. నచ్చిన అమ్మాయి కావాలంటే మళ్లీ రూ.1200 కట్టాలి. అప్పుడే మీరు కోరిన పార్ట్‌నర్‌ను అద్దెకు ఇస్తారు. అయితే ఇందులో కొన్ని రూల్స్ ఉన్నాయి. అమ్మాయి లేదా అబ్బాయిని రెంట్ తీసుకుంటే డైరెక్ట్‌గా వాళ్లతో కాంటాక్ట్ కాకూడదు. అలాగే ఇంప్రెస్ చేయాలని బహుమతులు వంటివి ఇవ్వకూడదు. ఈ రూల్ ఇద్దరికీ వర్తిస్తుంది. ఈ పద్ధతి జపాన్‌లో ఎప్పటి నుంచో ఉందని సమాచారం. 1990నుంచే ఈ కల్చర్ ఉందని, ప్రస్తుతం ఇంకా పెరిగిందని తెలుస్తోంది. ఇండియాలో ఇదే స్కీమ్ వస్తుందో? రాదో? ఒకవేళవస్తే కనీసం 20 ఏళ్లు అయిన పట్టొచ్చు. మరి ఈ స్కీమ్ మీద మీ అభిప్రాయం ఏంటో కామెంట్ చేయండి.

# రాజకీయ మనుగడ కోసం నల్లారి తంటాలు..?



**తిరుపతి,తెలంగాణ దిశ:**నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రిగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పరిచయం అక్కరలేని పేరు. ఆయన అతి కొద్ది కాలమే ముఖ్యమంత్రిగా పనిచేసినా ఉభయ రాష్ట్రాల్లో ప్రజలందరికీ సుపరిచితమే. ఎందుకంటే రాష్ట్ర విభజన జరిగిన సమయంలో తెలంగాణ వాదులకు విలన్‌గా, ఆంధ్రప్రదేశ్ వాసులకు హీరోగా నిలిచిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఇప్పుడు దశాబ్దకాలం తర్వాత రాజకీయ మనుగడ కోసం తంటాలు పడుతు న్నారు. పార్టీలు మారినా ప్రయోజనం లేదు. రాష్ట్ర విభజన తర్వాత సొంత పార్టీని పెట్టుకున్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని ఏపీ ప్రజలకు కూడా ఆదరించలేదు. లాస్ట్ బాల్ సిక్స్ కొడతా అంటూ బీరాలు పలికిన నల్లారికి చివరకు రాజకీయంగా ఆశాభంగమే ఎదురయిం ది.. రాహుల్ గాంధీ సమక్షంలో పార్టీలో చేరారు. తర్వాత కాంగ్రెస్ లో ఆయన ఇమడ లేకపోయారు. మొన్నటి ఎన్నికలకు ముందు భారతీయ జనతా పార్టీలోకి మారారు. ఈసారైనా ఫేట్ మారుతుందని ఆయన గట్టిగా విశ్వసించారు. ఎందుకంటే 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కుదిరింది. దీంతో రాజంపేట పార్లమెంటు సభ్యుడిగా ఆయన బీజేపీ తరుపున బరిలోకి దిగారు. ఎంత మంది ప్రచారం చేసినా ఆయన గెలుపును సాధించలేకపోయారు. మళ్లీ రాజకీయాలకు దూరంగానే నిలిచిపోయారు. ఆయనకు ఎందుకో పాలిటిక్స్ కలసి రావడం లేదనిపిస్తుంది.. కానీ తాజాగా ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలవడంపై కూడా పెద్దయెత్తున ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అసలు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చంద్రబాబును కలవాల్సిన అవసరం ఏంటి? ఇద్దరి మధ్య ఖచ్చితంగా ఏపీ రాజకీయాలపైనే చర్చ జరిగి ఉంటుంది. అందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. ఎందుకంటే ఒకనాడు బద్ధశత్రువులుగా, అసెంబ్లీలో ఒకరిపై ఒకరు విమర్శించుకున్న ఈ నేతలిద్దరూ ఒక చోట చేరి మాట్లాడుకున్నారంటే అందులో పెద్ద మర్మమే ఉంటుంది. ఊరికే కలవరు మహానుభావులు అన్నట్లు వీరిద్దరి సమావేశం తర్వాత ఏపీ రాజకీయాల్లో అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయిఆంధ్రప్రదేశ్ నుంచి త్వరలో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. అందులో ఒకటి తనకు ఇవ్వాలని నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చంద్రబాబును కోరినట్లు తెలిసింది.

## మాదకద్రవ్యాల నియంత్రణకు

# పకడ్బందీ చర్యలు తీసుకోవాలి



**కంఠేశ్వర్,తెలంగాణ దిశ:**జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధితశాఖల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి మాదకద్ర వ్యాల నిరోధక కమిటీ సమావేశంలో సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ తోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సమావేశంలో చర్చించి, వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సూచనలు చేశారు.జిల్లాలో మత్తు పదార్థాలు,మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు.

చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు వివరిస్తూ విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గతేడాదితో పోలిస్తే జిల్లాలో ఈసారి గంజాయి కేసులు కొంతవరకు తగ్గాయని సీపీ కల్మేశ్వర్ తెలిపారు.

# సీజ్ చేసిన మిల్లుల్లో మిషనరీ మాయం?

**సూర్యాపేట,తెలంగాణ దిశ:**కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కోసం తీసుకున్న ధాన్యాన్ని తెగనమ్ముకున్న విషయంలో సీజ్ చేసిన ఓ మిల్లులో మిషనరీ మాయమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. దాదాపు రూ.40 కోట్ల విలువ చేసే సీఎంఆర్ ధాన్యాన్ని మాయం చేసిన సదరు మిల్లు యజమాని ఇతరుల పేరిట మరో మిల్లు నిర్మిస్తూ సీజ్ చేసిన మిల్లులోని మిషనరీని అక్రమంగా అక్కడకు తరలించినట్లు తెలుస్తున్నది. సీఎంఆర్‌ను కొందరు అక్రమార్కులకు వరంలా మార్చుకుంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం మిల్లులకు అప్పగిస్తే వాటిని మిల్లింగ్ చేయడం మానేసి వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ధాన్యాన్ని అడ్డదారుల్లో విక్రయించి సొమ్ము చేసుకున్నారు. దాదాపు 400 కోట్ల రూపాయలు ఖాజేసిన సూర్యాపేట జిల్లాలోని ఐదు మిల్లులను అధికారులు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. మొదట మూడు మిల్లులను సీజ్ చేసి యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపగా, వారు బెయిల్‌పై బయటకు వచ్చి దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. సీఎంఆర్ కోసం ఒత్తిడి పెరుగడంతో మరో రెండు మిల్లుల యజమానులు కూడా పైరవీ చేసి మరీ అధికారులతో కేసులు నమోదు చేయించుకున్నారనే ప్రచారం ఉంది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఐదు మిల్లులు సీజ్ కాగా, లెక్క ప్రకారం ధాన్యం లేని మిల్లులు మరో ఏడెనిమిది వరకు ఉంటాయన్నది అధికారుల అంచనా. వారంతా ఎప్పుడు బిచానా ఎత్తేస్తారో తెలియని పరిస్థితి. ఇదిలా ఉంటే వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ధాన్యాన్నే గాక ఏకంగా మిల్లులో ఉన్న మిషనరీని కూడా మాయం చేస్తున్న ఘనులు ఉన్నట్లు తెలుస్తున్నది. జిల్లాలోని ఓ మిల్లులో సుమారు 40 కోట్ల రూపాయల ప్రభుత్వ ధాన్యాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకున్న యజమాని అందులో ఉన్న సుమారు రెండు కోట్ల రూపాయల విలువ చేసే మిషనరీని కూడా ఎత్తుకుపోయినట్లు సమాచారం. ప్రస్తుతం సీజ్ చేసి ఉన్న మిల్లుకు సుమారు పది కిలోమీటర్ల దూరంలోనే మరొకరి పేరిట కొత్త మిల్లు నిర్మిస్తూ మిషనరీని అక్కడకు తరలించారని తెలిసింది. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం అక్రమాల్లో అధికారుల పాత్ర ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తున్నది. ధాన్యం మాయమైందని మిల్లును సీజ్ చేసిన సమయంలో పంచనామా ఎలా చేశారు? అందులో మిషనరీతోపాటు ఇతర సామాగ్రి ఎంత? ధాన్యం ఎంత ఉంది? అనేవి రాశారా, లేదా? అసలు మిల్లుకు తాళం వేసి వచ్చారా, లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.



# కాటన్ కట్టడానికి తూట్లు

**రాజమహేంద్రవరం,తెలంగాణ దిశ:**ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్న ధవళేశ్వరం ఆన కట్ట భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కాటన్ మహాశయుడు నిర్మించిన ఈ అద్భుత కట్టడం కనీస నిర్వహణను గత అయిదేళ్లలో జగన్ సర్కారు పట్టించుకోలేదు. దీనికి అక్రమార్కులూ తోడయ్యారు. బ్యారేజీ గేట్లకు తూట్లు పొడుస్తూ రొయ్య సీడ్ అపహరిస్తున్నారు. ఆనకట్ట గేట్ల వద్ద రొయ్య విత్తనాల సేకరణ నిబంధనకు విరుద్ధం. బ్యారేజీ గేట్లకు కొందరు రంధ్రాలు చేసి గొట్టాలు అమర్చి ఈ పని చేస్తున్నారు. విజ్జేశ్వరం నుంచి ధవళేశ్వరం వరకు ఉన్న గోదావరి నాలుగు పాయల్లో రోజుకు వెయ్యి లీటర్లకుపైగా ఈ విత్తనాలు సేకరిస్తున్నట్లు అంచనా. లీటరు ధర సుమారు రూ.300 ఉండటంతో గిరాకీ ఉన్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. బొబ్బర్లంకలో మత్స్యశాఖ కార్యాలయం ఉన్నా దృష్టిపెట్టడంలేదు. ఇప్పటికే గేట్లు తుప్పుపట్టి ప్రమాదకరంగా ఉన్నాయి. వీటికి తోడు రంధ్రాలు చేస్తుండడంతో జలాలు వృథాగా పోతున్నాయి. రబీ పంట కాలంలో గోదావరికి నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు ఈ జలాలు ఎంతో కీలకం. ఫలానా నంబరు గేటు వరకు తమదంటూ సరిహద్దులు నిర్దేశించుకుని దందా సాగిస్తున్నారు. గతంలో బొబ్బర్లంక, ధవళేశ్వరం రహదారుల మధ్య వివాదం ఏర్పడి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తగా పోలీసులు జోక్యం చేసుకున్నారు. పటిష్ఠ నిఘాకు సీసీ కెమెరాలు పెడతామని చెప్పినా ఆ దిశగా చర్యలు లేవు. ప్రస్తుతం వరద తగ్గడంతో బ్యారేజీ వద్ద నిత్యం 100 మంది వరకు దందా సాగిస్తున్నట్లు జలవనరులశాఖ అధికారులు గుర్తించారు.ఈ పని చేస్తున్నారు. విజ్జేశ్వరం నుంచి ధవళేశ్వరం వరకు ఉన్న గోదావరి నాలుగు పాయల్లో రోజుకు వెయ్యి లీటర్లకుపైగా ఈ విత్తనాలు సేకరిస్తున్నట్లు అంచనా. లీటరు ధర సుమారు రూ.300 ఉండటంతో గిరాకీ ఉన్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. బొబ్బర్లంకలో మత్స్యశాఖ కార్యాలయం ఉన్నా దృష్టిపెట్టడంలేదు. వైకాపా పాలనలో నాయకుల జోక్యంతో దోపిడీకి అడ్డుకట్టపడలేదు.

# రేవుల్లో ప్రత్యక్షం..ఆన్‌లైన్‌లో అదృశ్యం

**రాజమహేంద్రవరం,తెలంగాణ దిశ:** ఇసుక ఆన్‌లైన్‌లోనే కాదు.. ఆఫ్‌లైన్‌లోనూ పొం దవచ్చు.. ఇదీ అధికారుల మాట. ఆన్‌లైన్‌లో చూస్తే ఆయా ర్యాంపుల్లో ఇసుక నిల్ అంటూ చూపిస్తోంది. రేవుల్లో మాత్రం భారీ లారీల్లో పెద్ద మొత్తంలో తరలిపోతోంది. ఆఫ్‌లైన్‌లో రేవు వద్ద ఇసుక కోసం వెళ్తున్న సామాన్యులు ఇదేంటని ప్రశ్నిస్తే.. అదంతే..! అనే సమాధానం ఎదురవు తోంది. ఇంటి అవసరాలకు రోజుకు లారీ, రెండు లారీలకు మించి ఇసుక అవసరం ఉండదు. అలాంటిది ఆఫ్‌లైన్ పేరిట అవకాశంతో రేవుల్లో ఏకమొత్తంగా 20 టన్నుల లారీలు ప్రత్యక్షమవుతున్నాయి. గాయత్రీ ర్యాంపులో పలు భారీ లారీల్లో ఇసుక తరలిపోయింది. 20 టన్నుల ఏకమొత్తంలో బుక్ చేసినట్లు బిల్లులు చూపిస్తున్నారు. అక్కడకు వచ్చిన సామాన్యుడికి మాత్రం.. లారీ ఇసుక కూడా లేదనే సమాధానం సిబ్బంది నగరానికి చెందిన సత్యనారాయణ ఇంటి పనుల నిమిత్తం ఇసుక కోసం ఆన్‌లైన్‌లో ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కడా దగ్గర్లో ర్యాంపుల్లో ఇసుక చూపించడం లేదు. దీంతో రేవుల్లో చూద్దామని గాయత్రీ ర్యాంపునకు వెళితే అక్కడ భారీ లారీలతో ఇసుక తరలిపోతోంది.



# ఉమ్మడి అనంతకు రూ.24.63 కోట్లు

**- ఈసీబిల్లుల చెల్లింపుపై ఉద్యోగుల్లో ఆశలు**



**అనంత,తెలంగాణ దిశ:**ఈ ఏడాదిమేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పని చేసిన అధికారులు, ఉద్యోగులు పెండింగ్ బిల్లుల సొమ్ము వచ్చేసింది. ఇక నిర్దేశిత సిబ్బందికి చెల్లింపులు చేయాల్సి ఉంది. వారికే కాకుండా గుత్తేదారులకు బిల్లులు ఇవ్వాల్సి ఉంది. గతంలో ఎన్నికల జరిగిన రెండుమూడేళ్ల తర్వాత పెండింగ్ బిల్లులు మంజూరు అయ్యేవి. ఎన్నడూ లేనివిధంగా ఈసారి పెండింగ్ బిల్లులు పెట్టిన నాలుగు మాసాలకే ఎన్నికల సంఘం (ఈసీ) నిధులు మంజూరు చేయడం గమనార్హం. రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ వివేక్‌యాదవ్ సిఫార్సు చేసిన వెంటనే తెదేపా కూటమి ప్రభుత్వం రూ.299.37 కోట్లు మంజూరు చేసింది. ఇందులో అనంత జిల్లాకు రూ.17.27 కోట్లు శ్రీసత్యసాయి జిల్లాకు రూ.7.36 కోట్లు కేటాయించారు. సత్వరమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంత చెల్లిస్తారు.. పెండింగ్ బిల్లు మొత్తం ఇస్తారా.. లేదా? అన్న సందేహాలు ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు ఏకకాలంలో జరిగిన సంగతి తెలిసిందే. మే 13న పోలింగక్న, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగాయి. మార్చి, ఏప్రిల్ నుంచి జూన్ మొదటి వారం దాకా వేలాది మంది అధికారులు, ఉద్యోగులు ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పాలుపంచుకున్నారు. ఇందుకు కేడర్ల వారీగా తగిన ప్రోత్సాహకం, గౌరవవేతనం చెల్లించాల్సి ఉంది. పోలింగ్, ఓట్ల లెక్కింపు రోజుల్లో పని చేసిన సిబ్బందికి అక్కడికక్కడే నిర్దేశిత సొమ్ము చెల్లించారు. బీఎల్ఓ, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఆర్ఓ కార్యాలయాలు, జిల్లా ఎన్నికల కార్యాలయం, ఇలా అనేక చోట్లా పని చేసిన సిబ్బందికి అరకొర బిల్లు ఇచ్చారు. ఇప్పటికీ చాలా మందికి రూ.వేలల్లోనే బిల్లు చెల్లించాల్సి ఉంది. ఎన్నికల వ్యయం కోసం ఇప్పటికే కొంత నిధులు మంజూరు అయ్యాయి. ఒక్క అనంత జిల్లాకే దాదాపు రూ.14కోట్లుపైగా వచ్చినట్లు తెలుస్తోంది. దీన్ని ఇప్పటికే ఖర్చు పెట్టారు. ఈ క్రమంలో అనంత, రాప్తాడు, శింగనమల, తాడిపత్రి.. తదితర ప్రాంతాల్లో ఎన్నికల ఖర్చులో చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు వచ్చాయి.

మంజూరైన నిధులు, ఖర్చుకు పొంతన లేదన్న వాదన తెరపైకి వచ్చింది. ఫర్నీచర్, భోజనాలు, తాగునీరు, బ్యాలెట్ సామగ్రి ముద్రణ, బారికేడ్ల నిర్మాణం, వాహనాల అద్దె... ఇలా అనేక రూపాల్లో అద్దె చెల్లించాల్సి ఉంది. రూ.20కోట్లు దాకా అదనంగా నిధులు కావాలంటూ ఇది వరకే సీఈఓకు నివేదించారు. ఈనేపథ్యంలో వచ్చాయి.

# మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం!

**పుట్టపర్తి,తెలంగాణ దిశ:**నిరుపేదల్లో రక్తహీనత సమస్యలను అధిగమించాలి, పోషకాల లోపాలు నివారించాలి, బడుగుల ఆకలి తీర్చాలి, సంపూర్ణ పోషకాలు అందించాలన్న ఉద్దేశంతో గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచిత బియ్యం అందజేస్తోంది. కరోనా విపత్తు కాలంలో 2020 ఏప్రిల్ నుంచి ఇది అమలవుతోంది. కుటుంబంలో ఒకరికి అయిదు కిలోల చొప్పున ఇస్తున్నారు. తొలిత రెండేళ్లు అని ప్రకటించినా పొడిగిస్తూ వచ్చింది. మరోసారి 2028 వరకు పథకాన్ని కొనసాగిస్తామని ప్రధానమంత్రి మోదీ ఇటీవల ప్రకటించారు. దీంతో నిరుపేదలకు మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం అందనున్నాయి. పేదల ఆహార భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరోసా ఇస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో దారిద్రరేఖకు దిగువన ఉన్న 5,57,982 కుటుంబాలకు తెల్లకార్డులు ఇచ్చారు. ఇందులో జాతీయ ఆహార భద్రత చట్టం కింద 5,36,781 కుటుంబాలకు పథకం వర్తిస్తోంది. ప్రతి నెలా జిల్లాకు 8,700 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. మిగిలిన వాటికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. తెదేపా హయాంలో రుపాయికి కిలో బియ్యం పథకం అమలయ్యేది. కేంద్ర ప్రభుత్వం అందజేస్తుండటంతో గత ప్రభుత్వం 2023 జనవరి నుంచి ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేసి, ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులు లేనివారికి బియ్యాన్ని ఉచితంగా అందజేస్తోంది. ఈ విషయంపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ పీఎంజీకేఏవైలో జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోని కార్డుదారులకు మరో నాలుగేళ్లు ఉచితం బియ్యం పంపిణీకి గడువు పెంచారు. కార్డుదారులందరికీ పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నాం. పోషక విలువలతో కూడిన ఈ బియ్యాన్ని కార్డుదారులు వినియోగించుకోవాలని కోరారు.



# బార్లలో దిగొచ్చిన ధరలు



**తిరుపతి,తెలంగాణ దిశ:**నూతన మద్యం పాలసీతో బార్ల నిర్వాహకులు దిగొచ్చారు. మద్యం ధరలు తగ్గించారు. ఒక్కసారిగా బార్లకు మందుబాబుల తాకిడి తగ్గడంతో.. భారీ తగ్గింపు ధరలకు మద్యం అంటూ బార్ల వద్ద ఫ్లెక్సీలు పెట్టారు. గతంలో 9 హార్స్ మద్యం క్వార్టర్ సీసా ప్రభుత్వ మద్యం దుకాణంలో రూ.130కి విక్రయిస్తుంటే.. బార్లలో రూ.180కి అమ్మేవారు. ప్రస్తుతం అదే బార్‌లో రూ.140కే విక్రయిస్తున్నారు.

ఇక అధిక ధరల మద్యం ఎమ్మార్పీకే ఇస్తున్నారు. ఇన్నాళ్లూ ప్రభుత్వ దుకాణాల్లో నాణ్యమైన మద్యం లభ్యం కాకపోవడంతో.. బార్ల నిర్వాహకులు రెండింతల ధరలకు విక్రయించేవారు. మందుబాబులు సైతం నాణ్యమైన మద్యం కోసం అడిగినంత ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకురావడంతో అన్ని మద్యం దుకాణాల్లో నాణ్యమైన బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయి. అందులోనూ ఎమ్మార్పీ ధరలకు విక్రయిస్తున్నట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ విక్రయిస్తుం డటంతో మందుబాబులు ఎగబడుతున్నారు. దీంతో కొత్త దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఒక్కసారిగా బార్లకు మందుబాబుల తాకిడి తగ్గడంతో.. భారీ తగ్గింపు ధరలకు మద్యం అంటూ బార్ల వద్ద ఫ్లెక్సీలు పెట్టారు.

గతంలో 9 హార్స్ మద్యం క్వార్టర్ సీసా ప్రభుత్వ మద్యం దుకాణంలో రూ.130కి విక్రయిస్తుంటే.. బార్లలో రూ.180కి అమ్మేవారు. ప్రస్తుతం అదే బార్‌లో రూ.140కే విక్రయిస్తున్నారు. ఇక అధిక ధరల మద్యం ఎమ్మార్పీకే ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రెండోరోజు 184 నూతన మద్యం రిటైల్ దుకాణాలు ప్రారంభమయ్యాయి.

జిల్లాలో 227 మద్యం దుకాణాలకుగాను.. మరో 43 దుకాణాలు తెరుచుకోవాల్సి ఉంది. రూ.99లకే నాణ్యమైన చీఫ్ లిక్కర్ అందుబాటులో ఉంచారు. వారంరోజుల్లో ప్రారంభం అవుతాయని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ వాసుదేవ చౌదరి పేర్కొన్నారు. ఒక్కసారిగా బార్లకు మందుబాబుల తాకిడి తగ్గడంతో.. భారీ తగ్గింపు ధరలకు మద్యం అంటూ బార్ల వద్ద ఫ్లెక్సీలు పెట్టారు. గతంలో 9 హార్స్ మద్యం క్వార్టర్ సీసా ప్రభుత్వ మద్యం దుకాణంలో రూ.130కి విక్రయిస్తుంటే.. బార్లలో రూ.180కి అమ్మేవారు. ప్రస్తుతం అదే బార్‌లో రూ.140కే విక్రయిస్తున్నారు. ఇక అధిక ధరల మద్యం ఎమ్మార్పీకే ఇస్తున్నారు. ఖాళీ చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని మద్యం, కంప్యూటర్లు, ఇతర పరికరాలు తిరుపతిలోని మద్యం డిపోకు తరలించారు. రాత్రికి 40 దుకాణాలకు సంబంధించిన సరకు చేరింది. తిరుపతి డివిజన్‌లో మిగిలిన 108 దుకాణాలకు సంబంధించిన మద్యాన్ని తరలిస్తున్నారు.

# చనిపోయి 11 నిమిషాల తర్వాత బతికిన బామ్మ.. స్వర్గం గురించి షాకింగ్ విషయాలు వెల్లడి..!!



మనిషి చనిపోయిన తర్వాత స్వర్గం లేదా నరకానికి వెళతారని హిందువులు నమ్ముతుంటారు. భారతీయ సినిమాల్లో మరణం తర్వాత ఆత్మకు ఏమౌతుందనే నేపథ్యంలో వందల సంఖ్యలో సినిమాలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఇలాంటివి వాస్తవంగా ఉంటాయా అనే దానికి ఇప్పటికే చాలా సార్లు నిదర్శనం కనిపించింది. ఇలాంటి ఆశ్చర్యకరమైన సంఘటన గురించి కాన్సాస్ కు చెందిన 68 ఏళ్ల షార్లెట్ హెూమ్స్ అనే మహిళకు నిజంగా జరిగింది. అవును 2019లో అధిక రక్తపోటుకి సంబంధించిన పరీక్షల సమయంలో మరణానికి సమీపంలో ఉన్న అనుభవాన్ని ఎదుర్కొంది. ఆమె పరిస్థితి కొన్ని సెకన్ల వ్యవధిలో మరింత దిగజారింది. ఈ క్రమంలో ఆమె వైద్యపరంగా మరణించినట్లు ప్రకటించబడ్డారు. అయితే ఇది జరిగిన 11 నిమిషాల తర్వాత ఆమె తిరిగి బతికారు. ఈ కొన్ని నిమిషాల సమయంలో ఆమెకు కలిగిన ఆశ్చర్యకరమైన అనుభూతిని పంచుకున్నారు. ముందుగా ఆమె తన శరీరం పైన తేలియాడుతున్నట్లు భావనను పొందింది. అక్కడ ఉన్న వైద్యుల బృందం ఆమెను తిరిగి బ్రతికించడానికి ప్రయత్నాలు చేస్తున్నప్పుడు చూస్తుంది. వారు ఛాతీ కుదింపులు చేయడాన్ని తాను చూడగలిగానని, గదిలో గందరగోళం, శబ్దం గురించి ఆమె వివరించింది. ఈ కొద్ది నిమిషాల్లో ఆమె ప్రయాణం స్వర్గంలోని అందమైన దృశ్యానికి తీసుకెళ్లిందని వెల్లడించారు. ఈ క్రమంలో ప్రకాశవంతమైన రంగులు, దట్టమైన పచ్చదనం, అందమైన పువ్వులతో అసాధారణమైన అందమైన పరిసరాలను చూసినట్లు ఆమె స్పష్టంగా వివరించింది. సృష్టి అంతా భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లుగా అంతా సంగీతం, ఆనందంతో నిండిపోయిందని వెల్లడించింది. తనకు ముందుగా తన మరణించిన కుటుంబ సభ్యులు కనిపించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆమె తన కుమారుడిని చూసినట్లు పేర్కొన్నారు. స్వర్గంలో ఆత్మలు పెరుగుతూనే ఉంటాయని దేవుడు తనకు చెప్పాడని ఆమె పేర్కొంది. దీంతో మరణం తర్వాత జీవితం ఉంటుందని ఆమె తన అనుభవాన్ని వెల్లడించారు. ఈ 11 నిమిషాల మరణ సమయంలో ఆమె నరకానికి సంబంధించిన భయంకరమైన విజువల్స్, శబ్దాలు, విపరీతమైన వాసనలు, దూరం నుంచి అరుపులు వంటి వాటిని కూడా చూసినట్లు పేర్కొంది. జీవితంలో మనిషి చేసే పనుల వల్ల పర్యవసానాలను గురించి హెచ్చరించటానికి దేవుడు వాటిని కూడా చూపించాడని ఆమె అన్నారు. దీని తర్వాత స్పృహలోకి వచ్చిన ఆమె రెండు వారాల్లో పూర్తిగా కోలుకున్నారు. షార్లెట్ హెూమ్స్ తన 72వ ఏటలో నవంబర్ 28, 2023న మరణించే వరకు ఈ విషయాలను అనేక మందితో పంచుకున్నారు.

# చైనాయే బడా దోస్త్.. భారత్‌కు అత్యధిక దిగుమతులు ఆ దేశం నుంచే




ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లో చైనా నుంచి భారత్‌కు జరిగిన దిగుమతుల విలువ ఏకంగా 56.29 బిలియన్ డాలర్లు. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఇదే వ్యవధితో పోల్చితే 11.5 శాతం అధికం. నాడు 50.48 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఈ మేరకు విడుదలైన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. చైనా తర్వాతి స్థానంలో రష్యా ఉన్నది. కాగా, 2013-14 నుంచి 2017-18 వరకు భారత్‌కు వాణిజ్య భాగస్వామిగా చైనానే అగ్రస్థానంలో ఉన్నది. 2020-21లోనూ ఇంతే. అంతకుముందు యూఏఈ టాప్‌లో ఉండేది. అయితే 2021-22 నుంచి 2023-24 వరకు అమెరికా ఉన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మాత్రం మళ్లీ డ్రాగన్ దూసుకుపోతున్నది. గత నెల సెప్టెంబర్‌లో భారతీయ ఎగుమతులు స్వల్పంగా పెరిగాయి. నిరుడుతో పోల్చితే 0.5 శాతం పెరిగి 34.58 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక దిగుమతులు 1.6 శాతం ఎగిసి 55.36 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్య లోటు 20.78 బిలియన్ డాలర్లుగా ఉన్నది. గత ఏడాది సెప్టెంబర్‌లో 54.49 బిలియన్ డాలర్ల దిగుమతులు జరిగాయి. ఏప్రిల్-జూన్‌లో వాణిజ్య లోటు 137.44 బిలియన్ డాలర్లు. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్‌లో భారత్ నుంచి ఎగుమతులు అత్యధికంగా జరిగిన టాప్-10 దేశాల్లో అమెరికా, యూఏఈ, నెదర్లాండ్స్, బ్రిటన్, చైనా, సింగపూర్, సౌదీ అరేబియా, బంగ్లాదేశ్, జర్మనీ, దక్షిణాఫ్రికా ఉన్నాయి. ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో భారత్‌కు దిగుమతులు అత్యధికంగా చేసిన టాప్-10 దేశాల్లో చైనా, రష్యా, యూఏఈ, అమెరికా, ఇరాక్, సౌదీ అరేబియా, ఇండోనేషియా, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్, సింగపూర్ ఉన్నాయి.

బంగారం దిగుమతులు ఈ సెప్టెంబర్‌లో 4.39 బిలియన్ డాలర్లకు పెరిగాయి. నిరుడు ఇదే నెల 4.11 బిలియన్ డాలర్లు. ఏప్రిల్-సెప్టెంబర్ మొత్తంగా 6.9 శాతం ఎగబాకి 27 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గత నెల చమురు దిగుమతులు 10.44 శాతం పడిపోయి 12.53 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఏప్రిల్-సెప్టెంబర్‌లో 88.91 బిలియన్ డాలర్లు. సెప్టెంబర్‌లో దేశంలోకి వెండి దిగుమతులు 325.66 మిలియన్ డాలర్లు. కానీ ఏప్రిల్-సెప్టెంబర్‌లో చూసినైట్లైతే 2.29 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

# పోరాటం తీవ్రతరం చేస్తాం.. ఇజ్రాయెల్‌కు హెజ్ బొల్లా, ఇరాన్ వార్నింగ్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రతరంగా మారాయి. హమాస్ అధినేత యాహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ హతమార్చడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇక సిన్వర్ మృతితో హెజ్ బొల్లా కీలక వ్యాఖ్యలు చేసింది. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటం తీవ్రతరం అవుతుందని హెజ్‌బొల్లా గ్రూప్ ప్రకటించింది. ఇరాన్ కూడా ఇదే విధంగా స్పందించింది. తమ ఎదురుదాడులు బలోపేతం అవుతుందని ఐక్యరాజ్యసమితికి ఇరాన్ మిషన్ తెలిపింది. పాలస్తీనా విముక్తి కోసం, యువత, చిన్నారులు అతడి బాటలో నడుస్తారని తెలిపింది. ఆక్రమణ, శత్రుత్వ ధోరణి ఉన్నంతకాలం ప్రతిఘటన కొనసాగుతుందని తెలిపింది. అమరులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకువెళ్తామని పేర్కొంది. కాగా.. ఇప్పుడు ఇజ్రాయెల్ సైన్యం సిన్వర్ సోదరుడిని మట్టుబెట్టేందుకు రెడీ అవుతోంది. సిన్వర్ సోదరుడు మహమ్మద్, ఇతర హమాస్ మిలిటరీ కమాండర్ల జాడ కోసం గాలిస్తున్నామని ఐడీఎఫ్ వెల్లడించింది. ఇదిలా ఉంటే.. హమాస్ అధినేత మరణం తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. హమాస్ ఆయుధాలను వదిలి.. తమ బందీలను తిరిగి పంపిస్తే ఈ యుద్ధం రేపే ముగిస్తుందని పేర్కొన్నారు.



అదేవిధంగా తమ పౌరులను వదిలిన హమాస్ తీవ్రవాదులకు వారు బయటకు వచ్చి జీవించేలా అవకాశం కల్పిస్తామన్నారు. లేదంటే వేటాడి మరీ హతమరుస్తామని హెచ్చరించారు. "బందీల కుటుంబాలకు నేను చెప్పేది ఒక్కటే. యుద్ధంలో ఇది ముఖ్యమైన ఘట్టం. మీవారు మీ ఇంటికి చేరుకునేవరకు ఈ పోరాటం కొసాగుతుంది" అని వెల్లడించారు.

# కారులో ఎక్కువగా ప్రయాణిస్తున్నారా.. క్యాన్సర్ ముప్పు పొంచి ఉందట జాగ్రత్త..!


తరచూ కారు ప్రయాణాలతో క్యాన్సర్ ముప్పు పొంచి ఉందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ రోజుల్లో చాలామంది కారు ప్రయాణాలే చేస్తున్నారు. ఎక్కువ మంది కార్లలో వెళ్లేందుకే ఇష్టపడుతున్నారు. విందులు, వినోదాలు, టూర్లకు వెళ్లాలంటే తప్పకుండా కార్లనే వినియోగిస్తున్నారు. అయితే, కార్లలో ఎక్కువసేపు జర్నీ చేయడం, అదీ కారు అద్దాలు వేసుకుని వెళ్లడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. కారు క్యాబిన్లు క్యాన్సర్ కారక విష వాయువులతో నిండి ఉంటాయని తాజాగా అధ్యయనాలు చెబుతున్నాయి. అమెరికాలో ఇటీవల నిర్వహించిన పీర్ రివ్యూడ్ రిసెర్చ్ సంచలన విషయాలను వెల్లడించింది. క్యాబిన్‌లోని గాలిలో అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు ఉంటున్నట్లు తేల్చింది. ఈ వాయువులను పీల్చడంవల్ల కారులో ప్రయాణిస్తున్న వాళ్లు తీవ్రమైన అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. కారు క్యాబిన్‌లో క్యాన్సర్‌కు కారణమయ్యే కెమికల్స్ ఉత్పత్తి అవుతున్నాయని వివరించింది. అమెరికాలోని సుమారు 30 రాష్ట్రాల్లో నిర్వహించిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ముఖ్యంగా 2015 నుంచి 2022 వరకు మార్కెట్లోకి వచ్చిన కార్లపై ఈ అధ్యయనం నిర్వహించారు. కార్లు అగ్ని ప్రమాదానికి గురైనప్పుడు క్యాబిన్లో మంటలు వ్యాపించకుండా ఫ్లేమ్ రిటార్డెంట్ కెమికల్స్ ఉపయోగిస్తారు. సీట్లు, ఇంటీరియర్ తయారీలోనూ దీనిని వినియోగిస్తారు. రక్షణ కోసం వాడే ఈ కెమికల్స్ కారణంగానే ఇప్పుడు క్యాన్సర్ ముప్పు తలెత్తుతున్నదని నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో నడిచే 99 శాతం కార్లలో %ఇజఖ్రూ% అనే ఫ్లేమ్ రిటార్డెంట్ రసాయనాన్ని వాడుతున్నారు. దాంతోపాటు %ఐఇజఖ్రూ, ఎజఖ్రూ% అనే మరో రెండు ఫ్లేమ్ రిటార్డెంట్లను కూడా ఉపయోగిస్తున్నారు. ఈ రసాయనాలు క్యాన్సర్‌కు కారణమవుతున్నాయి. సగటున రోజుకు ఒక గంట కారు జర్నీ చేసినా ఆరోగ్యానికి ప్రమాదమేనని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ ప్రయాణాలు చేసే వ్యక్తులు, పిల్లలపై ఈ ప్రభావం తీవ్రంగా పడుతుందంటున్నారు.



ముఖ్యంగా శ్వాస సంబంధ సమస్యలు ఏర్పడుతాయని చెబుతున్నారు. పిల్లల్లో తక్కువ పెరుగుదల, ఉబ్బసం, నరాల బలహీనత, ఊబకాయం సహా పలు ఇబ్బందులు తలెత్తుతాయంటున్నారు. ఫ్లేమ్ రిటార్డెంట్ల వినియోగంవల్ల పిల్లల్లో శక్తి గణనీయంగా తగ్గుతున్నట్లు పరిశోధకులు వెల్లడించారు. నిజానికి పెద్దల కంటే పిల్లలు ఎక్కువగా శ్వాస తీసుకుంటారు. దీంతో వారి మీద ఫ్లేమ్ రిటార్డెంట్ కెమికల్స్ ప్రభావం అధికంగా ఉంటుంది. వేసవిలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని పరిశోధకులు తెలిపారు. విపరీతమైన వేడి కారణంగా కారు క్యాబిన్‌లో విష రసాయనాలను విడుదల చేసే వాయువులు పెరుగుతాయని వెల్లడించారు. వేసవిలో మరిన్ని శ్వాస సమస్యలు ఏర్పడే అవకాశం ఉందంటున్నారు. పరిస్థితి మరింత తీవ్రమైతే క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కారు క్యాబిన్‌లో విడుదలయ్యే విష రసాయనాల నుంచి కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా కాపాడుకోవచ్చు. వీలైనంత వరకు షెడ్లు, గ్యారేజీలలో కార్లు పార్కింగ్ చేసే సమయంలో విండోలు ఓపెన్ చేసి పెట్టాలి. టాక్సిక్ ఫ్లేమ్ రిటార్డెంట్ వాడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జర్నీకి కొద్ది సేపటి ముందు కారు అద్దాలు ఓపెన్ చేయాలి

# కొరియా ద్వీపకల్పంలో యుద్ధమేఘాలు..

కొరియా ద్వీపకల్పంలో యుద్ధమేఘాలు అలుముకుంటున్నాయి. ఉత్తర కొరియా, దక్షిణ కొరియా మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. దక్షిణ కొరియాపై పూర్తి స్థాయి యుద్ధానికి దిగేందుకు ఉత్తర కొరియా సిద్ధమవుతున్నదనే వార్తలు వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు ఈ వార్తలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. దక్షిణ కొరియా సైతం ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నదని తెలుస్తున్నది. ఇప్పటికే ఒకవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్-లెబనాన్,ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు కొరియాలోనూ యుద్ధం ముంచుకొచ్చే పరిస్థితులు కనిపిస్తుండటం ఆందోళనకరంగా మారింది. ముఖ్యంగా ఉత్తర కొరియాకు చైనా, రష్యాతో సంబంధాలు ఉండటం, దక్షిణ కొరియాకు అమెరికా మద్దతు ఉండటంతో ఇరు కొరియా దేశాల మధ్య యుద్ధం తలెత్తితే పర్యవసానాలు తీవ్రంగా ఉండే ప్రమాదం ఉంది. ఉత్తర కొరియాను ఆ దేశాధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ యుద్ధానికి సిద్ధం చేస్తున్నట్టు కనిపిస్తున్నది. గత వారం రోజుల్లో 14 లక్షల మంది యువత తమ ఆర్మీలో చేరారని ఆ దేశం ప్రకటించింది. రెండు రోజుల్లోనే 10 లక్షల మంది స్వచ్ఛందంగానే సైన్యంలో చేరారని చెప్పింది. దీనికి సంబంధించిన చిత్రాలను ఆ దేశ మీడియా విడుదలకూడా చేసింది. మరోవైపు దక్షిణ కొరియాను శత్రుదేశంగా పేర్కొంటూ ఏకంగా రాజ్యాంగ సవరణ చేసింది. 'ఉత్తర కొరియా రాజ్యాంగ అవసరాలకు అనుగుణంగా, అనివార్యమైన, చట్టబద్ధమైన చర్య ఇది' అంటూ



కిమ్ ప్రభుత్వం తన చర్యలను సమర్థిం చుకుంది. దక్షిణ కొరియాను ప్రధాన శత్రువుగా ఈ ఏడాది జనవరిలో కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించగా, ఇందుకు అనుగుణంగా ఇప్పుడు రాజ్యాంగ సవరణ చేశారు. ఇరు దేశాలను కలిపే రోడ్డు, రైలు మార్గాలను సైతం ఉత్తర కొరియా పేల్చేస్తున్నది. అణ్వాయుధాల్లో కీలకమైన యురేనియం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని సైతం గత నెల అధికారులకు కిమ్ ఆదేశాలు ఇచ్చారు. అణ్వాయుధ సంపత్తిని పెంచాలని ఆయన సూచించారు. ఇరు కొరియా దేశాల మధ్య ఏడు దశాబ్దాలుగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

# హమాస్ చీఫ్ సిన్వార్ స్థానాన్ని చేపట్టేదెవరు..? రేసులో పలువురి పేర్లు

ఇజ్రాయెల్‌తో పోరులో హమాస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిలో ప్రధాన వ్యూహకర్తగా వ్యవహరించిన ఆ మిలిటెంట్ గ్రూప్ అధినేత యహ్యా సిన్వార్ ను ఐడీఎఫ్ మట్టుబెట్టింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది. గాజాలోని రఫా పట్టణంపై ఐడీఎఫ్ ఈ నెల 7న చేసిన దాడిలో సిన్వార్ హతమైనట్టు ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ మంత్రి కట్జ్ నిర్ధారించారు. యహ్యా సిన్వార్.. హమాస్ మిలిటరీ విభాగంలో



కీలక వ్యక్తిగా ఎదిగారు. ఐడీఎఫ్ దాడుల్లో సిన్వార్ మృతి చెందడం ఆ గ్రూప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది. ఇప్పుడు ఆ మిలిటెంట్ గ్రూప్‌ను ముందుండి నడిపించేది వెరన్నదానిపై విస్తృతంగా చర్చ నడుస్తోంది రేసులో పలువురు ఉన్నత స్థాయి నేతల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఇందులో హమాస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన మహమ్మద్ అల్ జహర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన హమాస్ గ్రూప్‌ను ముందుండి నడిపిస్తాడని వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో సిన్వార్ సోదరుడు మహమ్మద్ సిన్వార్ పేరు సైతం ప్రచారంలో ఉంది. హమాస్ పొలిటికల్ బ్యూరో సీనియర్ సభ్యుడు మౌసా అబు మార్జౌక్, హమాస్ మిలిటరీ వింగ్ కమాండర్ మొహమ్మద్ దీఫ్, హమాస్ పొలిటికల్ బ్యూరో ఖలీల్ అల్ హయ్యా, ఖలేద్ మషాల్ సహా పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. 1962లో జన్మించిన సిన్వార్ గాజాలోని ఇస్లామిక్ యూనివర్సిటీ ఆందోళనల్లో పాల్గొనడంతో ఇజ్రాయెల్ 1980లో అరెస్ట్ చేసింది. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఇజ్రాయెల్‌పై పోరాటానికి ఆయుధాల ప్రయోగంలో శిక్షణ పొందిన వారిని నియమించి ఒక సంస్థను స్థాపించాడు. కాసమ్‌బ్రిగేడ్స్‌గా పేరొందిన ఆ గ్రూప్ తర్వాత హమాస్ మిలటరీ వింగ్‌గా మారింది. అనంతరం అతడిని అరెస్ట్ చేసిన ఇజ్రాయెల్ 426 ఏండ్ల జైలు శిక్ష విధించింది. 23 ఏండ్లు అతను ఇజ్రాయెల్ జైలులో గడిపాడు. 2011లో ఖైదీల ఒప్పందంతో విడుదలయ్యాడు. 2014లో హమాస్‌లో ప్రధాన నేతగా ఎదిగాడు. గత ఏడాది దాడిలో ప్రధాన పాత్ర పోషించాడు. గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిలో సిన్వార్ ప్రధాన వ్యూహకర్తగా వ్యవహరించారు. అప్పటి నుంచి ఇజ్రాయెల్ వాంటెడ్ లిస్టులో ఉన్న సిన్వార్ జాడను కనిపె ట్టడం ఇజ్రాయెల్‌కు కష్టతరంగా మారింది. గాజాలో నిర్మించిన సొరంగాల్లో ఆయన ఎక్కువగా ఉండేవారు. ఇదే క్రమంలో అప్పటివరకు హమాస్ చీఫ్‌గా ఉన్న ఇస్మాయిల్ హనియా ఇరాన్‌లోని టెహ్రాన్‌లో ఉండగా, ఆగస్టులో ఇజ్రాయెల్ మట్టుబెట్టడంతో ఆయన స్థానాన్ని సిన్వార్ స్వీకరించారు.

# మనుషుల నిజస్వరూపం బయటపడేది అప్పుడే... అసలు రంగు చూడాల్సిందే..

జీవితం చాలా విచిత్రమైనది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవరూ ఊహించనట్లే.. ఏ వ్యక్తి ఎలాంటి సందర్భంలో ఏ విధంగా ప్రవర్తిస్తారో కూడా అంచనా వేయలేం. పరిస్థితిని బట్టి వారి నిజస్వరూపం బయటపడుతుంది. మనం ఎంత దూరంగా లేదా దగ్గరగా ఉండాలో హెచ్చరిస్తుంది. అయితే ఇన్నాళ్లు మన పక్కనే ఉండి మంచి అనే మాస్క్ వేసుకుని తిరుగుతున్న వ్యక్తి అకస్మాత్తుగా మాస్క్ తీసేస్తే చాలా మంది తట్టుకోలేరు. కాగా అలాంటి మాస్క్ తీసి.. అసలైన క్యారెక్టర్ ను బయటపెట్టే సందర్భాలు కొన్ని ఉంటాయని చెప్తున్న నిపుణులు.. అవేంటో వివరిస్తున్నారు. అలా జరిగినా కూడా తట్టుకొని నిలబడాలని సూచిస్తున్నారు. లైఫ్ ఎప్పుడు పట్టుపరుపులు మాత్రమే ఇవ్వదు. కొన్నిసార్లు నేలపై ఉన్నావని కూడా గుర్తుచేస్తుంది. అలాంటి సంక్షోభ సమయమే అసలు మిత్రులు, నకిలీ దోస్తులు, దగ్గరి బంధువులు దూరం పెట్టడం, దూరపు చుట్టాల్లోనూ దగ్గరితనం కనిపించడం చూపిస్తుంది. ఇలాంటి గందరగోళ సమయాల్లోనే మనిషి నిజమైన రంగులను ప్రదర్శించే అవకాశం ఉంటుంది. అంతేకాదు ఒక వ్యక్తి సంక్షోభం సమయంలో ప్రతిస్పందించే విధానం కూడా ఈ కోవలోకే వస్తుంది. పరిస్థితికి భయపడుతున్నాడా? ప్రశాంతంగా సంయమనంతో ఉన్నాడా? బాధ్యత తీసుకుంటాడా లేక ఎదుటివారిపై నిందలు వేస్తాడా? అనేది నిర్ణయిస్తుంది. జీవితంలో ఎదురయ్యే నైతిక సందిగ్ధత.. మన విలువలు, సూత్రాలను నిజంగా పరీక్షించే క్షణం. కడుపున పుట్టిన వారు అయినా.. కన్న తల్లిదండ్రులు అయినా.. తప్పు చేస్తే తప్పు అని చెప్పేంత గొప్ప గుణం కలిగి ఉంటామా లేదా అనేది చెప్తుంది. ఎలాంటి పరిస్థితి ఎదురైనా నిజాయితీకి కట్టుబడి ఉంటామా లేక అసౌకర్య పరిస్థితికి తలొగ్గి తప్పును కప్పి పుచ్చుతామా అనేది నిర్ధారిస్తుంది. సౌలభ్యం, సంస్కారం మధ్య ఏది ఎంచుకుంటామో.. మన వ్యక్తిత్వం ఏంటో ఈ నైతిక సందిగ్ధత బయటపెడుతుంది. ఒక వ్యక్తి నిజమైన వ్యక్తిత్వం బయటపడేది ఊహించని శక్తిని పొందిన సమయం. అకస్మాత్తుగా అధికారం లేదా నియంత్రణ శక్తిని పొందితే వారి ప్రవర్తన నాటకీయంగా మారుతుంది. యజమానిగా అధికారం చెలాయిస్తారా లేక తమ పవర్ ను బాధ్యతాయుతంగా, న్యాయం కోసం ఉపయోగిస్తారా తెలుపుతుంది. తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు దయ, వినయం కలిగి ఉండటం సులభం. కానీ అగ్రస్థానంలో ఉన్నప్పుడు ఎలా వ్యవహరిస్తారనేది మీ అసలైన క్యారెక్టర్ ను రివీల్ చేస్తుంది. వైఫల్యం మనిషిని ఉత్తమంగా పరీక్షించే పరిస్థితి. జీవితం మన చేతుల్లో ఉన్నప్పుడు మనోహరంగా, సానుకూలంగా ఉండటం సులభం. కానీ ఎదురుదెబ్బలు తగిలినప్పుడే మన నిజస్వరూపం బయటపడుతుంది. వైఫల్యం ఎదుర్కొన్నప్పుడు తప్పుకుంటారా లేక మళ్లీ ప్రయత్నిస్తారా? తమ చర్యలకు బాధ్యత వహిస్తారా లేదా ఇతరులను నిందిస్తారా? తప్పుల నుండి నేర్చుకుంటారా లేదా పునరావృతం చేస్తారా? అనేది తెలుస్తుంది. మొత్తానికి ఓటమి మన స్థితిస్థాపకత, సంకల్పాన్ని పరీక్షిస్తుంది. ఇది మన వేషాలను తీసివేసి, నిజమైన రంగులను బయటకు తెస్తుంది. ఒక వ్యక్తి అసలు రంగు బయటపెట్టే పరిస్థితుల్లో ఒత్తిడి ఒకటి. ఇది ముఖం వెనుక ఉన్న మాస్క్ తొలగించి.. అత్యంత ప్రామాణికమైన స్వభావాలను బహిర్గతం చేస్తుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు కొంతమంది చిరాకు, అసహనానికి గురవుతారు, మరికొందరు ప్రశాంతంగా, కంపోజ్‌గా ఉంటారు. కొందరు వెనక్కి వెళ్లి తమను తాము ఒంటరిగా చేసుకోవచ్చు. ఇంకొందరు మద్దతు కోసం చేరుకోవచ్చు. ఈ సవాలు సమయాల్లో ఒత్తిడితో మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా మార్పు అనేది జీవితంలో ఒక భాగం. కానీ ఊహించని మార్పులకు మనం ఎలా స్పందిస్తామో మన క్యారెక్టర్ ను డిసైడ్ చేస్తుంది. ఉదాహరణకు ఉన్న ఊరును వదిలి వెళ్లాలనేది



ఆకస్మిక నిర్ణయం అయినప్పుడు కొందరు భయపడతారు. వెళ్లేందుకు సంకోచిస్తారు. ఇంకొందరు దాన్ని సవాలుగా స్వీకరిస్తారు. మరో మెట్టు ఎదిగేందుకు వాడుతారు. అంటే ఈ పరిస్థితి బలం, స్థితిస్థాపకత, వృద్ధికి వారి సామర్థ్యాన్ని వెల్లడిస్తుంది. చాలా మందికి గాసిప్స్ మాట్లాడుకోవడం అంటే చాలా ఇష్టం. ఒక దగ్గర గుమిగూడినప్పుడు.. అక్కడ లేని వ్యక్తి గురించి చర్చించడం, నెగెటివ్ చేయడం కామన్.

కానీ ఇలాంటి సందర్భాల్లోనూ అలాంటి సమాచారం వ్యాప్తి కాకుండా వ్యతిరేకించడం గొప్ప క్యారెక్టర్ ను ప్రదర్శిస్తాయి. రసవంతమైన ఇన్ఫర్మేషన్ చేతిలో ఉన్నప్పుడు కూడా గాసిపింగ్ కు అవకాశం ఇవ్వకపోవడం నిజంగా గొప్ప విషయమే. మనం సక్సెస్ అయినప్పుడు ఇంకొకరు విజయవంతమైతే ఓకే కానీ మనకు ఫెయిల్యూర్ ఎదురైనప్పుడు ఎదుటివారు సక్సెస్ అయితే మన రియాక్షన్ ఎలా ఉంటుందనేది.. అసలు స్వరూపాన్ని బయటపెడుతుంది. సంతోషిస్తారా?

# కాళేశ్వరం టెన్షన్?



**కరీంనగం,తెలంగాణ దిశ:**బీఆర్ఎస్ కీలక నేతలకు కష్టాలు రెట్టింపు అయ్యాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటెల రాజేందర్ చుట్టూ ఉచ్చు బిగుస్తున్న ట్లు కనిపిస్తోంది. రేపో మాపో కమిషన్ వీరికినోటీసులు ఇవ్వాలని ఆలో చన చేస్తోంది. వారికి వ్యతిరేకంగా బలమైన సాక్షాధారాలను సిద్ధం చేసింది. ఇప్పటివరకే సేకరించిన ఆధారాలతో మాజీలను విచారించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారంకేవలం పైసలు కోసం నిబంధనల కు తిలోధకాలు ఇచ్చినట్టు అంచనాకు వచ్చింది. ముఖ్యంగా రూల్స్ బ్రేక్‌చేసి మరీ,అప్పట్లో అధికారులు ఆనాటి ప్రభుత్వ పెద్దలకు అన్ని విధాలుగా సహకరించినట్టు గుర్తించింది. ఈ ప్రాజెక్టుపై కాగ్ లేవనెత్తిన అంశాలు, విజిలెన్స్ రిపోర్టు, అఫిడవి ట్లు వంటి నివేదికలను జ్యుడీషియల్ కమిషన్ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటివరకు బ్యారేజీలు, పంప్ హౌస్‌ల నిర్మాణం, సివిల్ వర్క్స్ వరకు పరిమితమైన అవినీతి, చివరకు విదేశాల నుంచి తెచ్చిన మోటార్ల కోనుగోలులో భారీగా అవకతవ కలు జరిగినట్టు గుర్తించింది కమిషన్. కాళేశ్వరంపై విచారణ చేపట్టిన పీసీ ఘోష్ కమిషన్, ఆసక్తికర విషయాలు బయటకు తీసినట్టు సమాచారం.కాళేశ్వరం కమీషన్ల ప్రాజెక్టుగా మారిపోయిన ట్టు తెలుస్తోంది. కింది నుంచి పైస్థాయి వరకు ఏజెన్సీలు ముడుపులు ముట్ట జెప్పినట్టు ప్రభుత్వ వర్గాల మాట. ఈక్రమంలో ప్రాజెక్టు అంచనాలను అమాంతంగాపెంచేశారు. ప్రాథ మికంగా కొన్ని అంశాలను జ్యుడీషియల్ కమిషన్ నిర్ధారించినట్టు అంతర్గత సమాచారం. 204పేజీలతో ప్రాథమిక రిపోర్టు ఘోష్ క మిషన్ రెడీ చేసింది. మార్చిలోగా తుది నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనుంది. కాళేశ్వరం కమిషన్ మళ్లీ ఓపెన్ కోర్టు నిర్వహించనుంది. అప్పటి ఫైనాన్స్ స్పెషల్ సీఎస్, ఇతర ఆర్థిక శాఖ అధికారులను మళ్లీ ప్రశ్నించనుంది. ఎందుకంటే గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు రుణాల సమీకరణ కోసం అనుమతుల జారీలో ఆర్థికశాఖ కీలకపాత్ర పోషించింది. కార్పొరేషన్‌కు లేని ఆదాయాన్ని ఉన్నట్లు చూపించి రుణాలు సేకరించినట్టు తెలుస్తోంది.క్రమంలో అధికారులతోపాటు అప్పటి బీఆర్ఎస్ నేత ప్రకాష్ తోపాటు బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులను రెండురోజుల్లో విచారించనుంది. మొత్తానికి కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పార్టీ కొంప కొల్లేరు చేయడం ఖాయమనే వాదన అప్పుడే నేతల్లో బలంగా వినిపిస్తోంది.

# పసుపు బోర్డు క్రెడిట్ వార్...

**నిజామాబాద్,తెలంగాణ దిశ:**తెలంగాణకు మోడీ సర్కార్ ఇచ్చిన కానుకగా.. పసుపు బోర్డు అంటూ బీజేపీ చేసిన ప్రచారపు ఆనందం కాసేపైనా నిలవలేదు. తాము లేఖ రాయడం వల్లే ఇదంతా జరిగినట్టుగా కాంగ్రెస్ మంత్రి తుమ్మల కామెంట్ చేయడంతో కాక చెలరేగింది. మంత్రి తుమ్మల కామెంట్‌పై ఎంపీ అరవింద్ బదులిస్తూ.. ఎడ్లబండి వెళ్తున్నప్పుడు తుమ్మల అనే ఈగ వాలి తానే చక్రాలను తిప్పుతున్నట్లు భావిస్తుందని ఎద్దేవా చేశారు. దీంతో తుమ్మల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సైతం ఇదే అంశంపై స్పందించడంతో.. వ్యవహారం మరో మలుపు తీసుకుంది.కవితతో పాటు కేటీఆర్ సైతం సరిగ్గా ఇలాంటి అభిప్రాయమే వ్యక్తం చేయడంతో.. రఘునందన్ మరో కోణంలో ఈ అంశంపై స్పందించారు. ఏకంగా కవిత ఆరోగ్యంపై అనుచిత వ్యాఖ్యలు చేసి అడ్డంగా బుక్ అయ్యారు. పసుపుబోర్డును తాము స్వాగతిస్తున్నామనీ. అయితే ప్రారంభంపైనే తమకు తీవ్ర అభ్యంతరాలున్నాయన్నది కవిత వాదన. ఇదొక పార్టీ కార్యక్రమంలా నడిచిందని.తాము స్థానిక ప్రజా ప్రతినిధులమనీ.. మాకు ఆహ్వానాలు అందలేదనీ.. 2014 నుంచి 18 వరకూ పసుపుబోర్డు కోసం తాను పార్లమెంటు వేదికగా పోరాటం చేశాననీ.. పాలిటిక్స్ కోసం పసుపు బోర్డు ఏర్పాటు కాక పోతే దిగుమతులు ఆపాలి. రూ. 15 వేల మద్దతు ధర పసుపు రైతులకు ఇవ్వాలి. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వెల్పూరులో ఉన్న 40 ఎకరాల స్పైసెస్ బోర్డు స్థలంలో




పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అన్నారు ఎమ్మెల్సీ కవిత.జక్రాన్ పల్లి దగ్గర ఎంపీ ధర్మపురి అరవింద్ ఎయిర్ పోర్టు తీసుకురావాలనీ,కంబోడియా మలేసియా లాంటి దేశాల నుంచి తక్కువ క్వాలిటీ పసుపు దిగుమతులు జరుగుతున్నాయనీ, ఇదే అంశంపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ను తాను రెండు సార్లు కలిశాననీ, బోర్డుతో పాటు మద్దతు ధర ఉంటే రైతులకు న్యాయం జరిగిందని గతం నుంచీ తాము ఇదే డిమాండ్ చేశామనీ అంటారు ఎమ్మెల్సీ కవిత.పసుపు బోర్డు వచ్చిన ఆనందంకన్నా.. ఈ నేతల పోరే తమను తీవ్రంగా బాధిస్తోందని వాపోతున్నారు పసుపు రైతులు. ఎవరు చేసినా రాష్ట్రాభివృద్ధికే చేయాలి కానీ.. ఈ పేరు కోసం పోరాటాలేంటి? ఆ సమయంలో అధికారంలో ఉన్నవారు.. తమ తమ రాజకీయ అవసరాల కోసం ఆయా.. పనులు చేయడం కూడా ఒక గొప్పేనా?అంటున్నారు.ఈ మాటలను విన్న సామాన్యులు.

# వారసుల సక్సెస్ రేటు ఎంత..!

**విజయవాడ,తెలంగాణ దిశ:**రాజకీయ పార్టీలు వారసులకు పగ్గాలు అప్పగించడం పరిపాటి. ప్రధానంగా ప్రాంతీయ పార్టీల్లో వారసులదే పార్టీలో ఆధిపత్యం.తండ్రులు, తాతలు స్థాపించిన పార్టీలను వీరు సక్రమంగా జనంలోకి తీసుకెళ్లి సక్సెస్ అవుతున్నారా? లేదా? అంటే సక్సెస్ రేటు మాత్రం తక్కువగానే ఉందని చెప్పాలి. దేశ వ్యాప్తంగా అనేక మంది ప్రాంతీయ పార్టీలను నెలకొల్పి తమ రాష్ట్రాల్లో అధికారాల్లోకి తెచ్చారు. కానీ వారసుల టైం వచ్చేసరికి మాత్రం పార్టీ వ్యవహారం మాత్రం తలకిందులవుతుంది. ఎక్కువ శాతం ఓటములు వారి ఖాతాల్లో పడుతున్నాయి. దీంతో వారసులు పార్టీని సక్రమంగా నడపలేకపోతున్నారని, తండ్రులే బెటర్ అన్న కామెంట్స్ పొలిటికల్ పార్టీల్లో ఉన్నాయి.. ఉత్తర్ ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీని ములాయం సింగ్ యాదవ్ నుంచి పగ్గాలు అందుకున్న తర్వాత అధికారంలోకి ఒకసారి మాత్రమే అఖిలేష్ యాదవ్ పార్టీని తీసుకు రాగలిగారు. ఎక్కువ సార్లు ఓటమి చవి చూశారు. తన తండ్రి స్థాపించిన పార్టీని సక్రమంగా నడపలేకపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక బీహార్ లోనూ లాలూ ప్రసాద్ యాదవ్ రాష్ట్రీయ జనతా దళ్ నేతృత్వంలో పార్టీని అధికారంలోకి తేగలిగారు. పలుమార్లు ముఖ్యమంత్రిగా కూడా ఆయన చేశారు. కానీ ఆయన తనయుడు తేజస్వి యాదవ్ చేతుల్లోకి వచ్చిన తర్వాత అది పూర్తిగా ఓటమి అంచునే తిరుగుతూ ఉంది. ఇక కాంగ్రెస్ పార్టీని తీసుకుంటే ఇందిరాగాంధీ పరావాలేదనిపించారు. తర్వాత రాహుల్ గాంధీ ఓకేలా పార్టీని విజయం వైపు నడిపించారు. తర్వాత వారసురాలిగా సోనియా గాంధీ కూడా రెండు సార్లు అధికారంలోకి తేగలిగారు. తర్వాత రాహుల్ గాంధీ నేతృత్వంలో రెండుసార్లు పార్టీ ఓటమి పాలయ్యింది. దక్షిణాది రాష్ట్రాల్లో... మహారాష్ట్రలో శివసేన కూడా అంతే. బాల్ థాక్రే ఉన్న సమయంలో ఒక ఊపు ఊపిన శివసేన నేడు వారసుడు ఉద్ధవ్ థాక్రే హయాం వచ్చేసరికి డీలా పడింది. రేపు ఆయన వారసుడు ఆదిత్య థాక్రే ఏ మేరకు పార్టీని నడుపుతాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క ఒడిశాలో మాత్రమే తన తండ్రి స్థాపించిన పార్టీని ఐదు సార్లు అధికారంలోకి నవీన్ పట్నాయక్ తేగలిగారు. మొన్నటి ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అలాగే కరుణానిధిని లెగసీని స్టాలిన్ ఒకసారి అందుకున్నారు. రెండోసారి ఆయన పార్టీని అధికారంలోకి తెస్తారా? అన్నది చూడాల్సి ఉంది. కర్ణాటకలోనూ దేవెగౌడ పలుమార్లు అధికారంలోకి తెచ్చిన జేడీయూను ఆయన తనయుడు కుమారస్వామి పార్టీని అధోగతి పాల్జేశారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఏతా వాతా తేలిందేంటంటే దేశంలో అన్ని రాష్ట్రాల్లో వారసులను జనం పెద్దగా ఆదరించలేదు. తెలుగు రాష్ట్రాల్లో... ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. ఎన్టీఆర్ వారసులు ఎవరూ రాజకీయాల్లోకి రాకపోయినా ఆయన వారసుడిగా చంద్రబాబు నాలుగుసార్లు అధికారంలోకి తెచ్చారు. అదే తన తండ్రి పేరు మీద అన్న తెలుగుదేశం పార్టీ పెట్టి ఎన్టీఆర్ తనయుడు హరికృష్ణ నెగ్గుకురాలేకపోయారు. ఇక కాంగ్రెస్ పార్టీని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండుసార్లు పార్టీని అధికారంలోకి తేగలిగారు. ఆయన కుమారుడు జగన్ రెండుసార్లు ఓటమి పాలయి, ఒకసారి అధికారంలోకి తేగలిగారు. వైఎస్ కుమార్తె షర్మిల అయితే పార్టీ పెట్టడం, విలీనం చేయడం కూడా జరిగిపోయాయి. ఇక తాజాగా లోకేష్ కు కూడా ప్రమోషన్ ఇవ్వాలని, ప్రభుత్వంలో ప్రాధాన్యత ఇవ్వాలని వినిపిస్తున్న డిమాండ్ కూడా సీనియర్ నేతలు చేస్తుండటంతో వారసుల సక్సెస్ రేటుపై చర్చ జరుగుతుంది. వారసులు ఎక్కువగా రాజకీయంగా విఫలమవుతున్నారన్నదే పొలిటికల్ ఫిగర్స్ చెబుతుండగా, సీనియర్ నేతలు మాత్రం అవేమీ పట్టించుకోకుండా ప్రాపకం కోసం ప్రయత్నిస్తున్నారు. మరి చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

## కులగణన సర్వే ఆధారంగానే రేషన్ కార్డులు..!

కరీంనగర్: రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కులగణన సర్వే ఆధారంగా జారీ చేయనున్నారు. అయితే కులగణనలో ఖచ్చితత్వం ఎంత? అన్న దానిపైనే ఇప్పుడు అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇళ్లకు వచ్చి యజమానులు చెప్పిన వివరాల ఆధారంగానే నమోదు చేసుకుని సర్వే సిబ్బంది వెళ్లారు. అయితే ఇది ఖచ్చితమైన సమాచారం అనేది మాత్రం క్లారిటీ లేదు. కొందరు పొలాలు, ఆస్తులను దాచి ఉంచారన్న కామెంట్స్ కూడా వినిపించాయి. ప్రభుత్వ పథకాలు తమకు అందవన్న భయంతోనే ప్రజలు తమ ఆస్తుల విషయాన్ని బయటపెట్టలేదని కూడా వార్తలు వచ్చాయి. అదే సమయంలో సిబ్బంది కూడా తూతూమంత్రంగా చేసిన ఈ సర్వే ప్రాతిపదికన రేషన్ కార్డులు మంజూరు చేస్తే ఎలా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతుంది. కులగణన లో అనేక ప్రశ్నలు వేశారు. యాభైకి పైగా ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడంలో సర్వే సిబ్బంది యాంత్రికంగానే వ్యవహరించారు. కనీసం వారి ఆదాయం గురించి కూడా ఆరా తీయలేదు. దీనివల్ల అనర్హులు ఎక్కువ మంది తెలుపు రంగు రేషన్ కార్డులు పొందే అవకాశముందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. రేషన్ కార్డుల జారీకి కులగణన సర్వే ప్రాతిపదిక కాకూడదు. దానికి నిబంధనలు వేరుగా ఉంటాయి. ఆదాయ పరిమితితో పాటు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిని గుర్తించడానికి అనేక మార్గాలున్నాయి. ఇప్పుడు తెలంగాణ జరిగిన కులగణన వల్ల ఖచ్చితమైన సమాచారం వచ్చిందన్న నమ్మకం ఎవరికీ లేదు. మరి దాని ప్రాతిపదికన ఎలా రేషన్ కార్డులు మంజూరు చేస్తారన్న ప్రశ్నకు పాలకుల వద్ద సమాధానం లేదు.పాత రేషన్ కార్డులను కూడా తొలగించే ప్రసక్తి లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈనెల 26 నుంచి తెలంగాణలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ జరగనుంది. రేషన్‌కార్డుల ఫైనల్ లిస్ట్ ను దాదాపు అధికారులు సిద్ధం చేశారు. కులగణన సర్వే ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నట్లు కూడా ప్రకటించారు. కొత్తగా ఆరున్నర లక్షల రేషన్‌కార్డులు ప్రభుత్వం జారీ చేసే అవకాశముందని కూడా చెబుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను కూడా గ్రామసభలో నిర్ధారించి రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయంతీసుకుందని చెబుతున్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని కూడా ప్రకటన చేసింది. అయితే అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని, అనవసరంగా ప్రజా ధనం దుర్వినియోగం చేసేలా కేవలం కులగణన సర్వేపై ఆధారప డవద్దన్న సూచనలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. మరి ఈ ప్రక్రియ సజావుగా సాగుతుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రారంభమవుతాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలుచేస్తున్నామన్నారు. వ్యవసాయ భూములు ఉన్న ప్రతి రైతుకు ఎకరానికి రూ.12,000, భూమిలేని నిరుపేద రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12,000 ఆర్థికసాయం అందజేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు.గ్రామసభలలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, ఇందులో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లబ్ధిదారుల జాబితా ఎక్కడో రూపొందించకుండా, గ్రామసభల లోనే ఖరారు చేస్తామన్నారు. ఎర్రుపాలెంలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతామన్నారు. చెరువులు, అడవులను రక్షిస్తూ ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో అర్బన్ పార్క్ అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు.కొత్త రేషన్ కార్డులకు సంబంధించి ఇంకా ఎలాంటి జాబితాలు తయారు కాలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

# పత్తి కొనుగోలుకు సన్నద్ధం

**నరసరావుపేట,తెలంగాణ దిశ:**పత్తి కొనుగోళ్లకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిద్ధమైంది. పల్నాడు జిల్లా పరిధిలో ఏడు చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చాయి. పత్తి జిన్నింగ్ పరిశ్రమల్లో, మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు తెరవనున్నారు. జిల్లాలో 65,826 వేలహెక్టార్లలో పత్తి సాగైంది. గతం కంటే పత్తి సాగు తగ్గింది. ప్రస్తుతం పత్తి కొనుగో ళ్లకు సీసీఐ ఆసక్తి చూపడంతో ధరల పెరుగుదలపై రైతుల్లో ఆశలు చిగురించాయి. 2024–25 సంవత్సరానికి పత్తి మద్దతు ధరను సీసీఐ ప్రకటించింది. పొడుగు పింజ రకానికి క్వింటా రూ.7,521,పొట్టి పిం జకు రూ.7,121గా నిర్ణయించింది. గత ఏడాది మొదటి రకానికి రూ.7,020, రెండో రకానికి రూ.6,620 ప్రకటించారు. ఈ ఏడాది క్వింటాపై రూ.501 పెంచింది. జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇం డియా ఆధ్వర్యంలో ఏడు చోట్ల పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. చిలకలూరిపేట మార్కెట్ యార్డు పరిధిలో శ్రీవెంకట కృష్ణా ఎంటర్ ప్రైజెస్, శ్రీఉమామహేశ్వర కాటన్, పిడుగురాళ్ల పరిధిలోని లక్ష్మీగణపతి కాటన్‌మిల్, అమరలింగేశ్వర ఎంటర్ ప్రైజెస్, సత్తెనపల్లి పరిధిలో విజయచైతన్య ఎంటర్ ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్, లక్ష్మీకాటన్ ట్రేడింగ్ కంపెనీ, మాచర్ల పరిధిలోని లక్ష్మీనరసింహ జిన్నింగ్ మిల్‌లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి ధరలు నేలచూపు చూస్తున్నాయి. రైతులకు పత్తి చేతికందిన తొలినా ళ్లలో క్వింటా రూ.7,500 నుంచి రూ.8వేల వరకు పలికింది. ఈ నేపథ్యంలో మంచి ధరలు ఉంటాయని అందరూ భావించారు. కొన్నిరోజులకేధరలు తగ్గుముఖం పట్టాయి.ప్రైవేటు వ్యాపారులు నాణ్య తనుబట్టి క్వింటాలుకు రూ.5,500 నుంచి రూ.6,500 వరకు ఇస్తున్నా రు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నాణ్యత లేని పత్తి వస్తుందని వ్యాపారులు ధరలో కోత విధిస్తున్నారని కర్షకులు తెలిపారు. పెట్టుబడు లకు అప్పులు తెచ్చిన రైతులు, మరోవైపు



వరి,మిరప పంటల కు పెట్టుబడులు పెట్టాల్సిన వారుపత్తి దిగుబడులను అయిన కాడికి అమ్ము కోవాల్సివస్తోంది. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు ధరలు బాగా తగ్గించికొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రూ. 7వేలైనా వస్తుందని రైతు లు ఆశించినా పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. తాజాగా సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని నిర్ణయించటంతో మంచి ధరలులభించే అవకాశాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు. రైతులుతమ సమీపంలోని సచివాలయం,రైతుసేవా కేంద్రాల్లో ముంద స్తుగా పేర్లనమోదు చేసుకోవాలి. తర్వాత కొనుగోలు తేదీ, ఏ కేంద్రానికి వెళ్లాలో వివరాలు సమాచారం అందుతుంది. రైతులు ఆరోజుపత్తిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. గతంలో పత్తి రైతులంతా కేంద్రాలవద్ద బారులు దీరే పరిస్థితి. గంటలు, రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. వాహనాల అద్దె, నిర్వహణ ఖర్చులను భరించాల్సి వచ్చేది. ప్రస్తుతం సులువుగా అమ్మకాలు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులు మధ్యవర్తులకు కాకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద మధ్యవర్తులు వస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జేసీ సూరజ్ గనోరే హెచ్చరించారు.

# ప్రతిపాదనలే.. పనులెక్కడ?

**పుత్తూరు,తెలంగాణ దిశ:** జిల్లాలోని మార్కెట్ కమిటీ పరిధిలోని రోడ్లు అభివృద్ధికి రెండేళ్ల క్రితం మార్కెటింగ్ శాఖ అధికారులు హడావుడిగా ప్రతిపాదనలు పంపాలని కోరారు. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 22 మార్కెట్ కమిటీల పాలకవర్గ సభ్యులు, కార్యదర్శులు హడావుడిగా వాటిని గుర్తించి జిల్లా అధికారులకు నివేదించారు. వాటికి పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 257 పనులు, 712.5 కిమీ మేర రోడ్లకు రూ.70.66 కోట్లు అవసరమని నివేదించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఆయా కమిటీల పరిధిలో ఉన్న ఆస్తులను నాబార్డుకు తనఖా పెట్టి నిధులు తెచ్చి రోడ్లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం తలచింది. ఇందుకు నాబార్డు అంగీకరించలేదు. ఫలితంగా రెండేళ్లుగా ఈ దస్త్రాలు ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రస్తుతం కమిటీల్లో వేతనాలకు కూడా వెంపర్లాడాల్సిన దుస్థితి. కమిటీలకు ఆదాయం పుష్కలంగా ఉన్న సమయంలో గ్రామాల్లో పశువైద్య శిబిరాలు, రోడ్ల మరమ్మతులకు నిధులు ఆయా కమిటీల ఆదాయం నుంచి కొంత ఖర్చు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో కమిటీలను తనఖా పెట్టి రుణాలు పొంది రోడ్లు నిర్మాణం చేపట్టాలన్న ప్రభుత్వం ఆలోచనకు నాబార్డు గండి కొట్టింది.

# జీరో సైజ్ ...మోసాలు... ఇంతింత కాదయా...

**హైదరాబాద్,తెలంగాణ దిశ:**అనుష్క నటించిన జీరో సైజ్ సినిమా చూసే ఉంటారు. కాస్త బొద్దుగా ఉండే అనుష్క.. స్లిమ్ గా మారిపోవాలని ఓ క్లినిక్ లో చేరిపోతుంది. అక్కడ తనలాగే వందల మంది కనిపిస్తారు. క్రమంగా.. రోజులు గడిచే కొద్దీ అసలు విషయం బోధపడుతుంది. అదంతా ఓ వ్యాపారమని.. వారి ఆశలు, మరొకరికి వ్యాపార అవసరాలని గుర్తిస్తుంది. అనైతిక పద్ధతుల్లో, సరైన శాస్త్రీయ ప్రమాణాలు పాటించకుండానే బరువు తగ్గించే టిప్స్ అంటూ..వినియోగదారుల్ని మోసం చేస్తున్నట్లు గుర్తించి.. పోరాడుతుంది. సరిగా అలాంటి ఘటనే హైదరాబాద్ లో చోటు చేసుకుంది.కాస్తా బరువు పెరిగితే చాలా అమ్మాయిలు తెగ బాధపడిపోతుంటారు. అందమంతా కోల్పోయినట్లు దిగాలు చెందుతారు. ఎవరో ఏదో అనుకుంటారనే అనుమానంతో బరువు తగ్గేందుకు శతవిధాల ప్రయత్నిస్తుంటారు. అలాంటి వాళ్లే టార్గెట్ గా అనేక సంస్థలు పుట్టుకొచ్చాయి. మోసపోయే వాళ్లు ఉన్నంత కాలం.. మోసం చేసే వాళ్లు ఉంటారు అన్నట్లుగా ఇదో వ్యాపారంగా మారిపోయింది. ఉన్నఫళంగా బరువు తగ్గిపోవాలని కోరుకునే వాళ్ల ఆశలకు అంతు లేనప్పుడు.. వారికి మంచి మాటలతో లక్షలు, కోట్లు పోగుసుకునే వాళ్లూ ఉంటూనే ఉంటారు. ఇలాంటి ఓ సంస్థకు రాష్ట్ర వినియోగదారుల కమిషన్ షాక్ ఇచ్చింది. వైద్యుల సలహా లేకుండా, నిపుణుల పర్యవేక్షణ లేకుండా ఊబకాయం, శరీరంలోని అధిక కొవ్వును తగ్గిస్తామనే క్లినిక్ లపై నివేదిక సమర్పించాలంటూ.. హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో, వైద్య విధాన పరిషత్ లకు ఆదేశాలు జారీ చేసింది. బరువు తగ్గిస్తామని చెప్పి.. భారీగా డబ్బులు కట్టించుకున్న ఓ సంస్థ నుంచి తిరిగి వడ్డీతో సహా తిరిగి వసూలు చేసింది.సంగారెడ్డికి చెందిన ఓ యువతి అధిక బరువు తగ్గించుకునేందుకు హైదరాబాద్, హఫీజ్‌పేటలోని కలర్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే క్లినిక్ ను సంప్రదించింది. 2022లో కలర్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ మియాపూర్ బ్రాంచిలో చేరి రూ.1.05 లక్షలు ఫీజుగా చెల్లించారు. కానీ..అక్కడ అనుకున్న మేర ఫలితాలు రాకపోవడం, సరైన వైద్య సహాయం లేకుండానే చికిత్స అందిస్తుండడంతో.. ఆ యువతి తనకు అందిస్తున్న కోర్సు నుంచి బయటకు వచ్చేసింది.

తాను చెల్లించిన డబ్బుల్ని తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేసింది. సదరు సంస్థ నిరాకరించడంతో.. సంగారెడ్డిలోని జిల్లా వినియోగదారుల కమిషన్ ను ఆశ్రయించింది ఆయువతి. బరువు తగ్గిస్తామని చెప్పి తనను మోసం చేశారని, అధికంగా డబ్బులు వసూలు చేసి మోసం చేసారంటూ ఫిర్యాదు చేసింది. దీనిపై విచారించిన జిల్లా వినియోగదారుల కమిషన్? ఫిర్యాదుదారుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. యువతి చెల్లించిన ఫీజు తిరిగి చెల్లించాలని సూచించింది. ఈ తీర్పును వ్యతిరేకించిన కలర్స్.. రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ను సంప్రదించారు.ఈ కేసు వివరాల్ని పరిశీలించిన రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇన్‌ఛార్జి అధ్యక్షురాలు మీనా రామనాథన్, సభ్యులు వి.వి.శేషుబాబులతో కూడిన ధర్మాసనం.. క్లినిక్ కు వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది. నిబంధనలకు విరుద్ధంగా యువతి నుంచి డబ్బులు వసూలు చేయడంతో పాటు బరువు తగ్గిస్తామని మోసం చేసినట్లు గుర్తించింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద సదరు సంస్థ రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పటికీ.. బరువు తగ్గించే అంశం అందులో లేదని గుర్తు చేసింది. కేవలం..

ఫిజియోథెరపీ, చర్మ రక్షణకు సంబంధించిన అనుమతి మాత్రమే ఉందని తెలిపింది. అలాంటప్పుడు.. ప్రభుత్వ అనుమతి లేకుండా, వైద్యుల పర్యవేక్షణ లేకుండా.. యువత నుంచి డబ్బులు ఎలా స్వీకరించారని, అలాంటి సర్వీసులు ఎందుకు అందిస్తున్నారంటూ మండిపడింది. సరైన ధ్రువపత్రాలు లేకుండా ఇలాంటి సంస్థలను నిర్వహించడం సేవా లోపమంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది.ఎలాంటి అనుమతులు, సర్టిఫికెట్, లైసెన్స్ లేకుండా బరువు తగ్గిస్తామని హామీ ఇచ్చిన సంస్థకు జలక్ ఇచ్చింది.

యువతికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమైనందుకు యువతి చెల్లించిన రూ.1.05 లక్షలకు 9% వడ్డీని జత చేసి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. దాంతో పాటు యువతి మానసిక వేదనకు కారణమయ్యారంటూ ఆరోపిస్తూ యువతికి పరిహారం కింద రూ.50 వేలు, కోర్టు ఖర్చులకు మరో రూ.5 వేలు చెల్లించాలంటూ తీర్పు వెలువరించింది. దాంతో పాటే.. రాష్ట్రంలోని ఇలాంటి ఇతర సంస్థలపై చర్యలకు సిద్ధమైన రాష్ట్ర వినియోగదారుల కమిషన్.. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పుట్టుకొస్తున్న క్లినిక్‌ల పై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని హైదరాబాద్ డీఎండహెచ్‌వో, వైద్య విధాన పరిషత్ లకు ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి సంస్థల కార్యకలాపాలపై మార్చి 17లోగా పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలంటూ ఆదేశించింది.

# కొండెనిక్కిన ఆయిల్ ధరలు



హైదరాబాద్: మలేషియా స్టాక్ఎక్స్ఛేంజ్‌లో పతనం కారణంగా, దేశీయ చమురు–నూనె గింజలపై తీవ్ర ప్రభావం పడింది. దేశంలోని చమురులో ఆవాలు–నూనె గింజలు, వేరుశెనగ నూనె, సోయాబీన్ నూనె, ముడి పామాయిల్, పత్తి గింజల నూనె ధరలు పెరిగాయి. నూనెగింజల మార్కెట్‌లో నష్టాలు చవిచూశాయి. అయితే ఇవాళ కాస్త నూనె గింజల ధరలు మెరుగుపడుతుండగా, వేరుశనగ నూనె గింజలు, సోయాబీన్ నూనె గింజల ధరలు మునుపటి స్థాయిలోనే ఉన్నాయి. దేశీయంగా ఎడిబుల్ ఆయిల్స్ ధరలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. ఆవాల బంపర్ ఉత్పత్తి జరుగుతున్న తరుణంలో ఇదీ పరిస్థితి. ఇప్పటికీ ఆవాల నూనె కిలోకు పది రూపాయలు పెరిగింది. ఈ విధంగా వేరుశెనగ నూనె ధరలు రూ.15 నుంచి 20 పెరగ్గా, శుద్ధి చేసిన సోయాబీన్ ధరలు కూడా రూ.10 నుంచి 15 వరకు పెరిగాయి. విదేశీ నూనెలు కూడా పెరిగాయి. ప్రభుత్వ నియంత్రణ కొరవడడంతో వంటనూనెల ధరలు స్పెక్యులేటర్లపైనే ఆధారపడి ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే నూనెల ధరలు కూడా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారమలేషియా ఎక్స్ఛేంజ్‌లో క్షీణత కొనసాగుతోంది. చికాగో ఎక్స్ఛేంజ్‌లో మెరుగుదల ఉంది. వచ్చే నెలలో మార్కెట్లకు కొత్త ఆవాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆవాలు, కందుల ధరలు తగ్గుముఖం పట్టినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఆవాలు ఈసారి ఎటువంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోలేదు. ఎందుకంటే ఊంఈఇఆ, ఔంఈఇఆ వంటి సహకార సంస్థలు చాలా నియంత్రణలో మార్కెట్‌లో ఆవాల స్టాక్‌ను విడుదల చేశాయి. 2024–25 సంవత్సరం (నవంబర్–అక్టోబర్) మొదటి రెండు నెలల్లో భారతదేశం ఎడిబుల్ ఆయిల్స్ దిగుమతిలో 13.03 శాతం పెరుగుదల నమోదు చేసింది.ఇటీవలి కాలంలో వేరుశనగ, పత్తి గింజల ధరల్లో మెరుగుదల కనిపించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అన్ని రాష్ట్రాల్లోనూ ఈ నూనె గింజల ధరల్లో క్వింటాల్‌కు రూ.15–20 మెరుగుపడడం, ఈ నూనె గింజల ఎడిబుల్ ఆయిల్ ధరలు తగ్గడం, వేరుశనగ నూనె, పత్తి గింజల తగ్గుదలకు ప్రధాన కారణం. నూనె. సోయాబీన్ డీగమ్ ఆయిల్ దిగుమతికి కిలోకు రూ.102 వస్తుందని మార్కెట్ వర్గాలు తెలిపారు. కానీ డబ్బు సమస్య కారణంగా దిగుమతిదారులు ఈ నూనెను ఓడరేవుల్లో కిలో రూ.97 ధరకు విక్రయిస్తున్నారు. ఈ తక్కువ ధరకు విక్రయించడం వల్ల సోయాబీన్ నూనె ధరలు తగ్గుతున్నాయి. మలేషియా ఎక్స్ఛేంజ్ పతనం కాకుండా, అధిక ధరలకు కొనుగోలు చేయకపోవడంతో సీపీఓ, పామోలిన్ ఆయిల్ ధరలు కూడా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఈ నూనెల ధరలు మాత్రమే ఎక్కువగా ఉన్నాయని, వాస్తవానికి కొనుగోలుదారుల కొరత చాలా ఎక్కువగా ఉందంటున్నారు మార్కెట్ వర్గాలు.మలేషియాలో పామ్, పామోలిన్ ఆయిల్‌పై దిగుమతి సుంకం ధరలలో హెచ్చుతగ్గుల గురించి మన చమురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే నూనె–నూనె గింజల ఉత్పత్తిని పెంచడం అసాధ్యం. తలసరి ఎడిబుల్ ఆయిల్ వినియోగం చాలా తక్కువగా ఉన్నందున ఎడిబుల్ ఆయిల్ ధర స్వల్పంగా పెరిగితే బడ్జెట్ చెడిపోతుందనే అపోహ క్రియేట్ చేశారన్నారు. అందుకు భిన్నంగా ఏళ్ల తరబడి స్తబ్దుగా ఉన్న ధరలతో సతమతమవుతున్న ఎడిబుల్ ఆయిల్ ధరల పెంపునకు శ్రీకారం చుట్టడం వల్ల నూనె గింజల ఉత్పత్తిని పెంచేందుకు రైతులను పురికొల్పడంతోపాటు దేశంలోని విలువైన విదేశీ మారకద్రవ్య వ్యయాన్ని తగ్గించవచ్చు.

ఆవాలు నూనె గింజలు క్వింటాల్‌కు రూ. 6,550–6,600. వేరుశనగ క్వింటాల్‌కు రూ. 5,850–6,175. వేరుసెనగ నూనె మిల్లు డెలివరీ (గుజరాత్) క్వింటాల్‌కు రూ. 13,850. వేరుశనగ శుద్ధి చేసిన నూనె టిన్‌కు రూ. 2,105–2,405. ఆవాల నూనె దాద్రీ క్వింటాల్‌కు రూ. 13,550.ఆవాలు పక్కి ఘనీ ఒక్కో టిన్ రూ. 2,300–2,400. ఆవాలు కచ్చి ఘనీ ఒక్కో టిన్ రూ. 2,300–2,425. నువ్వుల నూనె మిల్లు డెలివరీ క్వింటాల్‌కు రూ. 18,900–21,000. సోయాబీన్ ఆయిల్ మిల్లు డెలివరీ ఢిల్లీ క్వింటాల్‌కు రూ. 13,500. సోయాబీన్ మిల్ డెలివరీ ఇండోర్ క్వింటాల్‌కు రూ. 13,300. సోయాబీన్ నూనె దేగం, కండ్ల క్వింటాలుకు రూ.9,650. సీపీఓ మాజీ కండ్ల క్వింటాల్‌కు రూ. 12,950. పత్తి గింజల మిల్లు డెలివరీ (హర్యానా) క్వింటాల్‌కు రూ. 12,100. పామోలిన్ ఖీఃఆ, ఢిల్లీ క్వింటాల్‌కు రూ. 14,200. పామోలిన్ ఎక్స్–కాండ్లా క్వింటాల్‌కు రూ. 13,300 (ఊూ లేకుండా). సోయాబీన్ ధాన్యం క్వింటాల్‌కు రూ.4,400–4,450. సోయాబీన్ లూజ్ క్వింటాల్‌కు రూ.4,100–4,200.



## కాలుష్య కోరల్లో 'యమున'

ఒకప్పుడు యయునా నదీ జలాలు స్వచ్ఛంగా వుండేవి. ఇప్పుడు యమునా జలాలంటే కాలుష్యానికి ఆలవాలం. జనాభా పెరగడం, స్వాతంత్ర్యానం తరం నదీ తీరాన పారిశ్రామికీకరణ విపరీతంగా జరగడంతో నది కాలుష్యం కాలక్రమేణా పెరుగుతూ వచ్చింది. మానవ, పారిశ్రామిక వ్యర్థాలన్నీ నదిలోకి చేరి కాలుష్యానికి యమునా నది కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో యమునా నది మురుగు కాల్వను తలపిస్తుంటుంది. పారిశ్రామిక వ్యర్థాల కారణంగా నది నురగలు తేలుతూ దర్శనమిస్తోంది. ఢిల్లీ సమీపంలో ప్రవహించే ఈ నదినీటిని నేరుగా తాగడం, పంటలకు వాడటం ప్రమాదకరమని నిపుణుల పరిశీలనలో తేలింది. ఈ నీళ్లు తాగడానికి కాదు గదా కనీసం స్నానానికి కూడా పనికి రావని, మానవ వ్యర్థాలు సాధారణ స్థితి కంటే 500 రెట్లు అధికంగా ఉన్నాయని ఢిల్లీ పొల్యూషన్ కంట్రోల్ కమిటీ ప్రభుత్వానికి నివేదికలో తెలియజేసినప్పటకీ వీటిని కాలుష్య కారకాల బారిన పడకుండా రక్షించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి.

ఢిల్లీ నగరానికి అవసరమైన తాగునీటిలో సగం వాటాను అందించే యమునా నది, దేశంలోనే అత్యంత కాలుష్యపూరిత నదుల్లో ముందు వరసలో ఉంది. ఈ కాలుష్యంలో 70 నుంచి 80 శాతం ఢిల్లీ సమీపంలో ఈ నది ప్రవహించే 22 కిలోమీటర్ల పరిధిలోనే చేరుతున్నట్లు నిపుణులు పేర్కొంటు న్నారు. యమునా నదీ జలాలను శుద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా 'యమునా యాక్షన్ ప్లాన్' పేరుతో 1992 నుంచి ప్రణాళికలు రూపొందిం చినా కాలుష్యంలో ఫలితం కనిపించడం లేదు. దేశ రాజధాని ప్రజల నీటి అవసరాలను, ఆరోగ్యాన్ని, అలాగే పర్యాటక ప్రాభవాన్ని దృష్టిలో ఉంచుకుని యమునా నది ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

# సత్యనిష్ఠే.. ఏకైక మార్గం



'భావనమే' జీవనం. జీవ దేహం కేవలం ఒక ఉపకరణం. ఇంద్రియ గ్రహణం, ప్రజ్ఞ, ఉద్వేగాలు, అభ్యాసం, అస్తిత్వరూపం, నిర్ణయాలు, పట్టుదల, అనుభూతి విస్తృతి.. అన్నీ భావప్రపంచమే. అయితే.. ఈ భావప్రపంచం సత్య, శాంత, స్పష్ట సమర్థతతో, సుసంస్కారంతో సాగాలంటే.. శరీరం సంతులిత సమర్థతతో పనిచేస్తూ ఆరోగ్యంగా ఉండటం అత్యవసరం. కానీ, తగినంత ఆరోగ్యంగా ఉన్నవారిలో కూడా చాలా వరకు భావప్రపంచం సమర్థతతో పనిచేయకపోవడం కీలకమైన సమస్య. అందులోనూ అధికారం, ధనం, విద్య (మేధస్సు) ఉన్నవారిలో ఈ దోషం ఉండటం సమాజానికి ప్రబలమైన సమస్య. భావప్రపంచాన్ని సంస్కారబలంతో నడుపగలిగింది సదా 'సత్యనిష్ఠ'. సత్యజీవనం.. విద్య.అసత్య జీవనం.. అవిద్య. దైనందిన మానవ జీ వనం సత్యాసత్యాల 'మిశ్రమం'. 'సమానతా భావమయమైన' సరళజీ వనం, సమష్టి శాంతి, నిర్భయత, ఆరోగ్యం, కృషి, పరస్పర ఆదరణ, ఆధ్యాత్మిక సాధన, సంతృప్తి, ఆనందానుభవం ఇవన్నీ అనివార్యంగా సత్యాన్ని ఆశ్రయించి సాగుతుంటాయి. 'ఆధిక్యతాభావ మయమైన' సంపద్గత జీవనం, కాంక్ష , ప్రకృతిశోషణ, ఘర్షణ, హననం, ఆక్రమణ, ప్రాణనష్టం, భయం ఇవి అసత్యాన్ని ఆశ్రయించి సాగుతాయి. మానవ 'జీవితాన్ని శాసించవలసిన సత్యాలు ఇవి.. 'యద్దృశ్యం తన్నశ్యం'–కనిపించే 'పదార్థజగత్తు' ఏ మినహాయింపు లేకుండా ఎప్పటికైనా కాలం మింగేసేదే. లోకంలో అందరూ మరణించినట్లే నేనూ పోతానుబీ నేను నా పూర్వీకులను గుర్తుచేసుకోనట్లే, తరువాతి కాలంలో నన్ను ఎవరూ తలచుకోరు.. అన్న బలమైన స్పృహతో సహజంగా జీవించడం. నేను, నా గొప్పతనం ఎంతోమంది సహాయ సహకారాల వల్ల రూపు దిద్దుకున్నదే కానీ, కేవలం నా కృషివల్ల కాదు అన్న ఎరుక కలిగి కృతజ్ఞతతో జీవించడం. ఎన్ని గొప్పపనులు చేసినా.. దైవం (ప్రకృతి) ప్రసాదించిన విశిష్ఠతతో తాను నిర్వహించిన ధర్మంగానే భావిస్తూ.. సామాన్యులతో తాదాత్మ్యత వదులుకోకుండా ఉండటం.

పంచభూతాలు మానవ సృష్టికాదు కాబట్టి..ఏవ్యక్తులకూ వాటిపై సొంత ఆస్తిగా వాడుకునే హక్కు ఉండని వ్యవస్థను ఏర్పాటు చేసుకునే నిష్ఠ కలిగి ఉండటం. ఏసమాజాలకు సాంస్కృతికమైన ఏ విశిష్టతలు ఉన్నా మౌలిక స్థాయిలో అహింస, ఆత్మీయత అందరికీ ఉండి తీరవలసిందన్నస్పృహకలిగి ఉండటం. ఎవరి మత విశ్వాసాలూ, దైవాలూ, ఆచారాలూ, లోకాలూ వారికున్నా అందరి 'మౌలిక చైతన్యం' ఒక్కటే అన్న స్పృహతో పరస్పర నిర్ద్వేషంతో, ఆదరణతో జీవించాలన్న నిశ్చయబలం. ఈ సత్యనిష్ఠే లోక శ్రేయస్సుకు ఎప్పటికైనా ఆధారం, ఏకైకమార్గం! వదలి చేసే ఇతర ప్రయత్నాలు.. కేవలం గాలిమేడలే!

# 35 శాతమే వేతన పెంపు

## బోయింగ్ కంపెనీ ప్రతిపాదనకు కార్మికుల తిరస్కారం రెంటాన్

(వాషింగ్టన్) : వేతనాల పెంపుపై బోయింగ్ కంపెనీ తాజాగా చేసిన ప్రతిపాదనలను ఫ్యాక్టరీ కార్మికులు వ్యతిరేకించారు.తమ ధర్నాను కొనసాగించారు. వేతనాల పెంపు కోరుతూ గత ఆరు వారాలుగా కార్మికులు కొనసాగుతున్న సమ్మె కారణంగా బోయింగ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలిచిపోయింది. కంపెనీ యాజమాన్యం ఇచ్చిన కాంట్రాక్ట్ ఆఫర్‌పై బుధవారం ఓటింగ్ జరిగిందని, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ మెషినిస్ట్స్ అండ్ ఏరోస్పేస్ వర్కర్స్ సభ్యులు 64శాతం మంది దీన్ని




వ్యతిరేకించారని స్థానిక యూనియన్ నేతలు తెలిపారు. ఏటికేడాది కంపెనీ కార్మికులను మోసం చేస్తూ సరిగా వ్యవహరించనప్పుడు అందుకు తగిన పర్యవసానాలు వుంటాయన్నది సుస్పష్టమని, ఇందుకు సాక్ష్యాలు కూడా వున్నాయని ఐఎఎం డిస్ట్రిక్ట్ 751యూనియన్ అధ్యక్షుడు జాన్ హెూల్డెన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంపెనీ ఈ ఓటింగ్‌పై వెంటనే ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.జనవరిలో అలాస్కా ఎయిర్‌లైన్స్ విమానం తలుపు ఊడిపోయిన నేపథ్యంలో పలు సంస్థల దర్యాప్తులను ఎదుర్కొంటున్న బోయింగ్‌కు ఇదొక సవాళ్ల సంవత్సరంగా మారింది. అటువంటి పరిస్థితుల్లో ఈ వివాదం రేగింది.


ఈసమ్మె కారణంగా కంపెనీకి నగదు అందుబాటులో లేకుండాపోయింది. నాలుగేళ్ల కాలంలో 35శాతం వేతనాలు పెంచుతామన్నది కంపెనీ ఇచ్చిన తాజా ఆఫర్. తొలుత కంపెనీ ఇచ్చిన ఆఫర్ 25శాతం పెంపు కావడంతో కార్మికులు సమ్మె చేపట్టారు.

ఆరువారాల సమ్మె నేపథ్యంలో కంపెనీ తాజాగా 35శాతానికి పెంచింది. దాన్ని కార్మికులు తిరస్కరించారు. మూడేళ్ల కాలంలో 40శాతం వేతనాలను పెంచాలని యూనియన్ డిమాండ్ చేస్తోంది.

## భారతదేశంలో అత్యధిక దేవాలయాలు ఉన్న రాష్ట్రాలు ఏవో తెలుసా..

భారతదేశంలో దేవాలయాల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది అనే విషయం మన అందరికీ తెలిసిందే. కొన్ని ప్రాంతాలలో మరీ ముఖ్యంగా ఎక్కువ దేవాలయాలు ఉంటూ ఉంటాయి. ఇక ఏదైనా ప్రసిద్ధి పొందిన దేవాలయం ఉంది అంటే దాని చుట్టు పక్కల కూడా పెద్ద ఎత్తున దేవాలయాలు ఉంటాయి. ఇకపోతే భారత దేశంలో అత్యధిక దేవాలయాలు కలిగిన టాప్ 7 రాష్ట్రాలు ఏవి ..? ఆ రాష్ట్రాలలో ఎన్ని దేవాలయాలు ఉన్నాయి అనే వివరాలను తెలుసుకుందాం.రాజస్థాన్ : రాజస్థాన్ రాష్ట్రం భారతదేశంలో ఎక్కువ దేవాలయాలు కలిగి ఉన్న లిస్ట్ లో ఏడవ స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో 39000 దేవాలయాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ : భారతదేశంలో అత్యధిక దేవాలయాలు కలిగి ఉన్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 6 వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 47000 దేవాలయాలు ఉన్నాయి. గుజరాత్ : భారత దేశంలో అత్యధిక దేవాలయాలు ఉన్న రాష్ట్రాలలో గుజరాత్ 5వ స్థానంలో ఉంది.

## సూపర్ హిట్ జోడి...



అమరావతి: ఒకరేమో సీఎం.. మరొకరేమో డిప్యూటీ సీఎం.. వారిద్దరి లక్ష్యం ప్రజాసంక్షేమ పాలన సాగించడమే. అయితే ఒకరిది సుధీర్ఘ రాజకీయ చరిత్ర.. మరొకరిది అందుకు భిన్నమైనా ఊహించని రీతిలో రాజకీయ రంగప్రవేశం చేసి, సక్సెస్ అయ్యారు. అంతవరకు ఓకే కానీ.. అనతి కాలంలోనే డిప్యూటీ సీఎంగా ప్రజల మన్ననలు పొందడమే కాక, ఏకంగా పల్లెలనుఅభివృద్ధి బాటలో పయనింపజేసేందుకు భారీ ప్రణాళిక రూపొందించారు ఆయన. అందుకు సీఎంగా సుధీర్ఘ అనుభవం గల ఆ నేత.. తన ప్రభుత్వంలో భాగమైన డిప్యూటీ సీఎంకు అభినందనలు తెలిపారు. ఇంతకు అభినందించిన సీఎం చంద్రబాబు అయితే..అభినందనలు అందుకున్న వారు ఎవరో మళ్లీ ప్రత్యేకంగా చెప్పాలా.. ఆయనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక.. పాలనా పరమైన అంశాలపై డిప్యూటీ సీఎం పవన్ అనతికాలంలోనే పట్టు సాధించారు. అంతేకాదు తనకు అప్పగించిన అటవీ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై పూర్తి అవగాహనతో అడుగులు వేస్తున్నారు పవన్. అందుకే కాబోలు తొలుత విస్తృత సమావేశాలు నిర్వహించి, తన శాఖల స్థితిగతులు అన్నీ తెలుసుకున్నారు. ఇక మంత్రిగా రంగంలోకి దిగిన తొలిసారే.. రాష్ట్రవ్యాప్త పల్లెపండుగకు పవన్ పిలుపునిచ్చారు. ఈనెల 14 నుండి 20వతేదీ వరకు అన్ని పంచాయతీలలో పంచాయతీ వారోత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు.

# చిక్కడు.. దొరకడు..!

## పార్టీలో హాట్ హాట్ గా ఎంవీపీ వ్యవహారం

విశాఖపట్టణం: పవర్ ఈజ్ ఆల్ వేస్ పవర్ ఫుల్. అందుకే అధికార పార్టీలో ఉండేందుకు..ఆ పార్టీ కండువా కప్పుకునేందుకు తెగ ఆసక్తి చూపిస్తుంటారు నేతలు. ఒకసారి పార్టీ అధికారం కోల్పోయిందంటే చాలు..లీడర్లు సైలెంట్ అయిపోతుంటారు.అలాంటి నేతల్లో విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఒకరు. రియల్ ఎస్టేట్ రంగంలో ఆయనకంటూ అంతో ఇంతో పేరుంది. పాలిటిక్స్‌కు వచ్చేసరికి ఓసారి ఎంపీ అయ్యారే తప్ప..ఎంవీవీ అంటే ఎవరూ ఠక్కున చెప్పలేని పరిస్థితి. ఎందుకంటే ఆయన విశాఖ ఎంపీగా పనిచేసిన కాలంలో కూడా పెద్దగా ప్రజల్లో తిరిగింది లేదు. జగన్ వస్తే వేదిక మీదకు మొక్కుబడిగా వచ్చి వెళ్లడం తప్పితే ఎంపీగా ఆయన పాత్ర చాలా పరిమితం. ఇందుకు బలమైన కారణమే ఉంది. రాజకీయాల్లో ఉంటూ వ్యాపారాలు చక్కబెట్టుకోవాలనున్నారు తప్పితే..రాజకీయం కోసం ఆయన ఏనాడూ వ్యాపారం చేయలేదని వైసీపీ నేతలే చెబుతుంటారు.అతి పెద్ద నగరంగా ఉన్న విశాఖ వంటి సిటీకి ఎంపీ అంటే రాష్ట్ర రాజకీయాలకు చాలా కీలకం. విశాఖలో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థల కార్యకలాపాల అంశంలోనూ, విభజన హామీలతో పాటుగా అనేక విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పలు సంప్రదింపులు, కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. కానీ ఎంవీవీ స్టైలే వేరు. ఆయన ఇలాంటి అంశాలపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవు.ఏపీలో వైసీపీ ఓడిపోయిన తర్వాత ఆ పార్టీ నేతలంతా డీలా పడిపోయారు. అక్కడో ఇక్కడో ఒకరిద్దరు నేతలు కాస్త మీడియా ముందు కనిపిస్తున్నారే తప్ప..దాదాపుగా అందరు నేతలూ సైలెంట్‌గా ఉన్నారు. అవంతి శ్రీనివాస్, ఆడారి ఆనంద్‌తో పాటుగా పలువురు నేతలు పార్టీకి గుడ్ బై చెప్పి వెళ్లిపోయారు. మరి కొంతమంది నేతలు కాస్తో, కూస్తో యాక్టీవ్‌గా ఉన్నారు. కానీ విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఆయన పార్టీలో యాక్టీవ్‌గా లేరు. పోనీ అలాగని అవంతి శ్రీనివాస్, ఆడారి ఆనంద్‌లా బయటకు వెళ్లిపోయారా అంటే అదీ లేదు. దీంతో అసలు ఎంవీవీ పార్టీలో ఉన్నారా..లేరా.. అనే కన్ఫ్యూజన్ క్యాడర్, లీడర్లలో కొనసాగుతోంది. పార్టీ ఓటమి తర్వాత ఎక్కడా కనిపించడమే లేదు. విశాఖ జిల్లా పార్టీ పరిస్థితులపై అధినేత జగన్ నిర్వహించిన సమీక్ష సమావేశాలకు కూడా ఎంవీవీ వెళ్లలేదు. అలాగే ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి నియమితులైన తర్వాత పార్టీ కార్యాలయంలో విశాఖ నేతలతో సమావేశం నిర్వహించారు. ఆ మీటింగ్‌కు కూడా ఎంవీవీ ఎగనామం పెట్టేశారు.అంతేకాదు రైతు సమస్యలపై అన్నదాతకు అండగా వైసీపీ, విద్యుత్ ఛార్జీలపైనా ఇటీవల వైసీపీ నిరసనలు చేపట్టింది. పార్టీ నేతలంతా పాల్గొనాలని హైకమాండ్ ఆదేశాలు జారీ చేసింది. కానీ ఎంవీవీ సత్యనారాయణ ఎక్కడా పత్తా లేరు. దీంతో ఈ మాజీ ఎంపీ వ్యవహారంపై వైసీపీలో అం దరికీ క్లారిటీ వచ్చేసింది. పార్టీకి దూరంగా ఉంటున్నాడంటే.. ఆయన కండువా మార్చేందుకు రెడీ అయ్యారన్న భావనకు వచ్చేశారట.ఎంవీవీ సత్యనారాయణ వైసీపీ కార్యకలాపాల్లో అస్సలు పాల్గొనడం లేదు. పార్టీని విడిచి పెట్టరు..అలాగని పార్టీ కోసం పనిచేయరు. పోనీ రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించారా అంటే అదీ లేదు. దీంతో వైసీపీ పెద్దలకు, క్యాడర్‌కు ఆయన వ్యవహారం ఏ మాత్రం అర్థం కావడం లేదట. 2019 ఎన్నికలకు ముందు పార్టీలో చేరి అనూహ్యంగా ఎంపీ అయిన ఎంవీవీని పార్టీ కూడా పట్టించుకోవడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి, ఓడిపోగానే మొహం చాటేస్తున్న నేత ఉంటేఏంటీ, లేకపోతే ఏంటీ అన్న రీతిలో పెద్దలు ఉన్నారట. ఆయనంతట ఆయనే రాజీనామా చేసి వెళ్లిపోతాడోమో అని ఎదురు చూస్తున్నారట.కానీ ఎంవీవీ మాత్రం ఆ పార్టీని వీడటం లేదు. ఏదో పార్టీలోకి దారి దొరికితే వైసీపీకి గుడ్‌బై చెబుదామని ఎదురుచూస్తున్నారట. కూటమి పార్టీల నుంచి లైన్ క్లియర్ కాకపోవడంతో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారట ఎంవీవీ సత్యనారాయణ. సైలెంట్‌గావైసీపీలో ఉన్నంత కాలం ఉండటం,రూట్ క్లియర్ కాగానే జంప్ కొట్టాలనే ప్లాన్‌లో ఎంవీవీ ఉన్నారని విశాఖ వైసీపీ వర్గాల టాక్.ఓవరాల్ ఎపిసోడ్‌ను చూసిన వారంతా ఈ పొలిటికల్ బిజినెస్ మెన్ రాజకీయాలను బాగా ఒంట పట్టించుకున్నారని చర్చించుకుంటున్నారట. ఎంవీవీ ఫ్యాన్ కిందే ఉంటారా లేక కూటమి గొడుకు కిందకు వెళ్తారా అన్నది వేచి చూడాలి మరి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215